ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
శుక్రవారం 7 మార్చి 2025



క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోండి: కలెక్టర్

శ్రీకాకుళం కలెక్టరేట్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): అభ్యంతరం కాని ప్రభుత్వ భూముల్లో 15-10-2019 నాటికి ఇళ్లు నిర్మించుకుని.. జీవిస్తున్న అర్హులైన కుటుంబాలకు చట్టబద్ధమైన హక్కులు కల్పించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు నిర్మాణాల క్రమబద్ధీకరణకు ఈ ఏడాది డిసెంబరు 31లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. నేటి నుంచి మీసేవా కేంద్రాలు, గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా దరఖాస్తుల స్వీకరణ జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు వినియోగించుకోవాలని కోరారు.

ఆ ముగ్గురికీ పట్టాలెలా ఇస్తారు?

- ప్రభుత్వ ఉద్యోగి భార్యలకు, పెళ్లికాని వ్యక్తికి పంపిణీపై ఆరా
- కొండపోరంబోకు స్థలం ఆక్రమణపై తహసీల్దార్ విచారణ
- నోటీసులిచ్చినా ఆగని అక్రమ నిర్మాణాలు
- వైసీపీ నేతల అండతో ఉద్యోగులకు బెదిరింపులు
- కలెక్టర్ దృష్టి సారించాలని స్థానికుల విజ్ఞప్తి

ఆయనో ప్రభుత్వ ఉద్యోగి. వైసీపీ ప్రభుత్వ హయాంలో కొండపోరంబోకు స్థలాన్ని ఆక్రమించాడు. ఆపై అక్రమ నిర్మాణాలు చేపట్టగా.. జేసీ ఆదేశాలతో తాత్కాలికంగా పనులు నిలిపేశారు. తాజాగా మళ్లీ అక్రమ నిర్మాణాలు ప్రారంభించగా రెవెన్యూ అధికారులు మళ్లీ అడ్డుకున్నారు. వాటిపై విచారణ చేపట్టగా.. ఆ ప్రభుత్వ ఉద్యోగి తన ఇద్దరి భార్యలతోపాటు పెళ్లికాని తన అన్నయ్య కొడుకు పేరిట గతంలో మూడు పట్టాలు మంజూరు చేయించుకున్నట్టు తేలింది. అసలు ప్రభుత్వ ఉద్యోగి కుటుంబానికి, పెళ్లికాని యువకుడుకు పట్టాలు ఎలా మంజూరు చేస్తారంటూ అధికారులను తహసీల్దార్ ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలకు సన్నద్ధమవుతున్నారు.



కొండపోరంబోకు స్థలంలో అక్రమ నిర్మాణాలు

శ్రీకాకుళం రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం మండలం సింగుపురం మేజర్ పంచాయతీలోని సర్వే నెంబర్ 360లో 1.20 ఎకరాల కొండపోరంబోకు స్థలంలో అక్రమ నిర్మాణాలు కొనసాగుతూనే ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో స్థానిక వైసీపీ నేత అండతో విద్యుత్ శాఖలోని ఓ ఉద్యోగి కొండపోరంబోకు స్థలాన్ని ఆక్రమించి.. అక్రమ నిర్మాణాలను చేపట్టాడు. దీనిపై గతేడాది సెప్టెంబరు 23న 'కొండపోరంబోకు భూమి కబ్జా' పేరుతో 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. దీంతో జేసీ స్పందించి అప్పటి తహసీల్దార్‌కు ఆదేశాలు జారీ చేయడంతో అక్రమ నిర్మాణాలు తాత్కాలికంగా నిలిపివేశారు. నోటీసులు కూడా జారీ చేశారు. ఎన్నికల అనంతరం అధికారులు మారడంతో మళ్లీ కొండపోరంబోకు స్థలంలో అక్రమ నిర్మాణాలు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో సింగుపురం వీఆర్వో బెహరా విశ్వేశ్వరరావు బుధవారం తహసీల్దార్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి.. అక్రమ నిర్మాణ పనులు అడ్డుకున్నారు.

● పట్టాల పంపిణీపై ఆరా..

కొండపోరంబోకు స్థలం ఆక్రమణపై ప్రస్తుత తహసీల్దార్ గణపతిరావు గురువారం సింగుపురం పంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. ఆక్రమణకు పాల్పడిన విద్యుత్ శాఖ ఉద్యోగికి గతంలో తహసీల్దార్లు కూడా సహకరించినట్లు గుర్తించారు. ప్రస్తుతం ఆక్రమణకు గురైన స్థలం సర్వే నెంబర్ 360 కొండపోరంబోకుగా రెవెన్యూ రికార్డులో ఉంది. అయితే విద్యుత్‌శాఖ ఉద్యోగి మాత్రం ఈ స్థలాన్ని తన కుటుంబ సభ్యులకు ప్రభుత్వం ఇచ్చిన పట్టా భూమిగా చెబుతున్నాడు. నిజానికి నిరుపేదలకు ప్రభుత్వం పట్టాలు కేటాయిస్తుంటుంది. అది కూడా కుటుంబంలో ఎవరో ఒకరికి మాత్రమే పట్టా ఇస్తారు. కానీ ఇక్కడ ఆక్రమణకు గురైన స్థలం.. నిరుపేద కుటుంబానికి ఇచ్చిన పట్టా కాదు. విద్యుత్‌శాఖలోని ఉన్నత స్థాయి అధికారి (మిగతా 6వ పేజీలో..)



విచారణ చేస్తున్న తహసీల్దార్ గణపతిరావు

గురువారం నమోదైన ఉష్ణోగ్రతలు (డిగ్రీల్లో)

ఆమదాలవలస	36.8
బూర్జ	37.1
ఎచ్చెర్ల	35.8
జి.సిగడాం	35.1
గార	35.9
హిరమండలం	36.9
ఇచ్ఛాపురం	33.9
జలుమూరు	35.3
కంచిలి	33.6
కవిటి	32.4
కోటబొమ్మాళి	32.8
కొత్తూరు	36.0
లావేరు	36.7
ఎల్.ఎన్.పేట	37.1
మందస	33.3
మెళియాపుట్టి	37.0
నందిగాం	33.3
నరసన్నపేట	35.4
పలాస	33.3
పాతపట్నం	35.1
పోలాకి	33.6
పొందూరు	38.3
రణస్థలం	36.1
సంతబొమ్మాళి	32.8
సారవకోట	37.0
సరుబుజ్జిలి	37.1
సోంపేట	37.1
శ్రీకాకుళం	35.2
టెక్కలి	32.5
వజ్రపుకొత్తూరు	33.3





శ్రీకాకుళంలో ఎండ తీవ్రతతో రక్షణ ఇలా..

మార్చిలోనే భగభగలు

- అధిక ఉష్ణోగ్రతలతో జిల్లావాసుల బెంబేలు
- పొందూరులో 38 డిగ్రీలు దాటేసిన వైనం
- వడగాల్పులుంటాయని ఏపీఎస్‌డీఎంఏ హెచ్చరిక

శ్రీకాకుళం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మార్చి నెలలోనే ఎండలు మండిపోతున్నాయి. పేదల ఊటీగా పేరుగాంచిన జిల్లాలో వడగాల్పులు ఆరంభమయ్యాయి. పగటి పూట గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మరో రెండు రోజులపాటు ఇదేరీతన వడగాల్పులు ఉంటాయని ఆంధ్రప్రదేశ్ స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ (ఏపీఎస్‌డీఎంఏ) హెచ్చరికలు జారీచేసింది. దీంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. పొందూరు మండలంలో గురువారం (మిగతా 6వ పేజీలో..)

పారదర్శకంగా..

- గీత కార్మికులకు మద్యం షాపుల కేటాయింపు: జేసీ ఫర్మాన్‌అహ్మద్ ఖాన్



లాటరీ తీస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

శ్రీకాకుళం క్రైం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో కల్లు గీత కార్మికుల్లో ఉప కులాలకు మద్యం షాపుల కేటాయింపు ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించారు. గీత కార్మికుల్లోని శ్రీశయన, సెగిడి, గౌడ, యాత, సొండి కులాలకు 18 మద్యం షాపులు కేటాయించగా.. మొత్తంగా 204 దరఖాస్తులు వచ్చాయి. గురువారం శ్రీకాకుళంలోని అంబేడ్కర్ కళావేదికలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్.. లాటరీ ప్రక్రియ ద్వారా గీత కార్మికులకు ఈ షాపులను కేటాయించారు. శ్రీశయనకు -10, సెగిడికి- 4, సొండి- 2, గౌడ, యాత కులానికి ఒక్కొక్క షాపు చొప్పున కేటాయించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ.. 'కులం, స్థానికత, ఉప కులం నిర్ధారించే ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలి. నిర్దేశించిన మొత్తాన్ని శుక్రవారం నాటికి చెల్లించిన వారికే షాపులు కేటాయిస్తాం. ఒకవేళ ఎవరైన అనర్హతకు గురైతే.. మొదటి ప్రాధాన్యతలో వచ్చిన తర్వాత వ్యక్తికి షాపులు కేటాయిస్తామ'ని తెలిపారు. ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ.. 'గతంలో జిల్లాలో 158 మద్యం దుకాణాలు ఉన్నాయి. నూతనంగా కల్లు గీత కార్మికులకు మరో 18 దుకాణాలు కేటాయించాం. జిల్లాలో అత్యధికంగా శ్రీకాకుళం, శ్రీకాకుళం రూరల్ దుకాణాలకు 50కిపైగా దరఖాస్తులు వచ్చాయి. ఈ మద్యం దుకాణాలకు ఇన్‌స్టాల్‌మెంట్‌లు చెల్లించిన తరువాత ప్రొహిబిషన్ లైసెన్స్‌లు అందిస్తామ'ని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ సీహెచ్ తిరుపతినాయుడు, శ్రీకాకుళం సీఐ ఎం.వి.గోపాలకృష్ణ పాల్గొన్నారు.

కొన్నారా.. మోసపోతారు!

- తాళ్లవలసలో అక్రమ లేఅవుట్లు
- పరిశ్రమల పేరిట ప్రచారం
- రూ.లక్షలకు విక్రయాలు

6లో

రాగి.. ఆరోగ్యానికి మేలు

- నాడు పేదింట్లోనే జావ.. నేడు అందరి ఇళ్లలోనూ..
- జిల్లాలో ప్రతి ఏటా పెరుగుతున్న సాగు విస్తీర్ణం

6లో

వీఆర్వోలపై పని ఒత్తిడి తగ్గించాలి

- రెవెన్యూ సేవలకే పరిమితం చేయాలి
- సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.అప్పలనాయుడు

7లో



నరసన్నపేటలో ఒక హోటల్‌లో వినియోగిస్తున్న గృహావసరాల గ్యాస్ సిలిండర్

హోటళ్లలో సబ్సిడీ సిలిండర్లు

- కానరాని వాణిజ్యం 'గ్యాస్'
- కొన్ని ప్రాంతాల్లో రీఫిల్లింగ్
- పట్టించుకోని అధికారులు

నరసన్నపేట, మార్చి 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సబ్సిడీ గ్యాస్ సిలిండర్లు పక్కదారి పడుతున్నాయి. శ్రీకాకుళం, నరసన్నపేట, టెక్కలి, పలాస, సోంపేట, ఆమదాలవలస, పాతపట్నం, రణస్థలం, ఎచ్చెర్ల, కోటబొమ్మాళి, ఇచ్ఛాపురం తదితర ప్రాంతాల్లోని హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల వద్ద వాణిజ్యమైనవి కాకుండా గృహ అవసరాల సిలిండర్లే కనిపిస్తున్నాయి. వాణిజ్య సిలిండర్లకు ఎటువంటి రాయితీ ఉండదు. ఈ నేపథ్యంలో వ్యాపారులు గ్యాస్ సిలిండర్లు సరఫరా చేసే సిబ్బందితో కుమ్మక్కై.. గృహవసర సిలిండర్లను కొనుగోలు చేసి వినియోగిస్తున్నారు. జిల్లాలో ప్రధాన పట్టణాల్లో మూడు గ్యాస్ కంపెనీలకు చెందిన సుమారు 47 ఏజెన్సీలు ఉన్నాయి. నిబంధనలు మేరకు వినియోగదారుల ఇంటికి ఉచితంగా గ్యాస్ సిలిండర్ రవాణా చేయాలి. కానీ కొన్ని ఏజెన్సీలకు చెందిన సిబ్బంది అదనంగా డబ్బులు వసూళ్లు చేస్తున్నారు. గృహ అవసరాలకు అయితే బుకింగ్ లేనిదే సిలిండర్లు ఇవ్వడం లేదు. కానీ హోటల్స్‌కు, బయట వ్యాపారులకు మాత్రం వారు ఎన్ని కావాలంటే అన్ని సబ్సిడీ సిలిండర్లు ఇస్తున్నారు. గృహ అవసరాలకు వినియోగించే సిలిండర్లు వ్యాపారం నిమిత్తం వాడకూడదు. కానీ గ్యాస్ సిబ్బంది ఈ సిలిండర్‌ను వ్యాపారులకు వెయ్యి రూపాయలకు విక్రయిస్తున్నారు. వాటిని వ్యాపారులు బహిరంగంగానే వినియోగిస్తున్నారు. కొన్ని హోటళ్లలో వ్యాపారానికి వినియోగించే సిలిండర్ ఒకటి స్టవ్ వద్ద ఉంచుతున్నారు. అందులో గ్యాస్ ఉండదు. పక్క నుంచి గృహవసరాల సిలిండర్‌ను వినియోగిస్తున్నారు. ఉదాహరణకు ఒక్క నరసన్నపేటలోనే 27 వరకు పెద్దహోటళ్లతోపాటు 50 వరకు చిన్న హోటల్స్ 100 వరకు తోపుడు బళ్లు ఉన్నాయి. వీటి నిర్వాహకులెవరూ వాణిజ్య సిలిండర్లు వినియోగించడం లేదు. నరసన్నపేట (మిగతా 6వ పేజీలో..)

సంక్షేమ బాట

- మూడు పథకాలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్
- అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, మత్స్యకార భరోసా అమలు
- బడ్జెట్‌లో నిధుల కేటాయింపు
- అన్ని వర్గాల ప్రజల హర్షం



ఇచ్ఛాపురం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలపై దృష్టి పెట్టింది. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, మత్స్యకార భరోసా పథకాలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించింది. ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభానికి ముందే మే నెలలో అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయనున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో వైఎస్సార్ రైతు భరోసా పేరిట పథకాన్ని అమలు చేశారు. ఏటా రైతుకు రూ.15వేలను సాగు ప్రోత్సాహం కింద అందిస్తామని చెప్పారు. తీరా అధికారంలోకి వచ్చాక కేవలం రూ.7,500 అందించారు. కేంద్రం అందించే పీఎం కిసాన్ రూ.6వేలతో కలిపి రూ.13,500 అందించి చేతులు దులుపుకొన్నారు. అయితే, తాము అధికారంలోకి వస్తే ప్రతి రైతుకు పెట్టుబడి సాయం కింద రూ.20వేలు అందిస్తామని చంద్రబాబు చెప్పారు. ఆయన చెప్పినట్లే అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నదాత సుఖీభవ పథకానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. కేంద్ర సాయం రూ.6వేలు, రాష్ట్ర సాయం రూ.14వేలు కలిపి మొత్తం రూ.20వేలు రైతుకు అందించనున్నారు. దీనికోసం ఏకంగా రూ.6,300 కోట్లు ఇటీవల బడ్జెట్‌లో కేటాయించారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 6.68 లక్షల ఎకరాల సాగుభూమి ఉంది. జిల్లాలో ఈ-పంట నమోదు చేసుకున్న రైతులు 2.41 లక్షల మంది రైతులు ఉన్నారు. దాదాపు వీరందరికీ అన్నదాత సుఖీభవ పేరిట ప్రభుత్వం సాయమందించే అవకాశం ఉంది.

తల్లికి వందనం..

కూటమి ప్రభుత్వం ఇచ్చిన మరో హామీ తల్లికి వందనం. ఈ పథకం కింద ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి రూ.15వేల చొప్పున సాయం అందిస్తామని చంద్రబాబు ప్రకటించారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి అమలు చేస్తామని మంత్రి ప్రకటించారు. దీనికోసం బడ్జెట్‌లో రూ.9,407 కోట్లు కేటాయించారు. ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు 2,655 ఉండగా.. అందులో 2,50,319 మంది చదువుతున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న.. తెల్ల రేషన్‌కార్డు కలిగిన ప్రతి విద్యార్థి తల్లికి ఈ పథకం తప్పకుండా దక్కుతుంది. దీంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాగా, గత వైసీపీ ప్రభుత్వం అమ్మఒడి కింద (మిగతా 6వ పేజీలో..

శుభ పరిణామం..

అన్నదాత సుఖీభవకు ప్రభుత్వం నిధులు కేటాయించడం శుభ పరిణామం. సాగు ప్రోత్సాహం లేక అన్నదాత ఇబ్బందులు పడుతున్నాడు. పెట్టుబడులు గణనీయంగా పెరిగాయి. ఈ పరిస్థితుల్లో ప్రతి రైతుకు రూ.20వేలు అందించేందుకు ప్రభుత్వం ముందుకు రావడం మంచి విషయం. అన్నదాత సుఖీభవకు బడ్జెట్‌లో నిధుల కేటాయింపు బాగుంది.

- దక్కత ఢిల్లీరావు, రైతు, ఇచ్ఛాపురం

అర్హులందరికీ అందించాలి..

ప్రభుత్వం తల్లికి వందనం పథకం పేరిట విద్యార్థుల చదువుకు ప్రోత్సాహం అందిస్తుండడం మంచి విషయం. రూ.15వేల చొప్పున ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి వర్తింపజేయడం శుభ పరిణామం. విద్యాసంవత్సరం ప్రారంభంలోనే ఈ పథకాన్ని అమలు చేసి అర్హులందరికీ అందించాలి.

- డి.లింగరాజు, విద్యార్థి తండ్రి, ఇచ్ఛాపురం

మత్స్యకారులకు మేలు..

మత్స్యకారులకు రెట్టింపు భరోసా అందించడానికి కూటమి ప్రభుత్వం ముందుకు రావడం ఆహ్వానించదగ్గ విషయం. గతంలో అనేక కొర్రీలు పెట్టి కేవలం రూ.10 వేలు మాత్రమే అందించేవారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రూ.20వేలు అందించేందుకు ముందుకు వచ్చింది. దీనివల్ల మత్స్యకారులకు ఎంతో మేలు జరగనుంది.

- సూరాడ చంద్రమోహన్, మత్స్యకార ఐక్యవేదిక ప్రతినిధి

శాసనసభలో మన వాణి

హుద్‌హుద్ ఇళ్లను అప్పగించాలి..

● ఎమ్మెల్యే శిరీష



పలాస, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో లబ్ధిదారులకు హుద్‌హుద్ ఇళ్లను అప్పగించాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. గురువారం అసెంబ్లీలో గృహ నిర్మాణశాఖ మంత్రి దృష్టికి సభలో హుద్‌హుద్ ఇళ్ల విషయాన్ని తీసుకువెళ్లారు. 75 శాతానికిపైగా గృహాల నిర్మాణం జరిగిందని, అందులో ఇంకా రహదారులు, తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్ల సౌకర్యం కల్పిస్తే ప్రారంభించుకోవచ్చని తెలిపారు. పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లో మొత్తం 380కుపైగా గృహాలు ఉన్నాయని తెలిపారు. గతంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హయాంలో నిర్మించిన ఈ గృహాలు కూటమి ప్రభుత్వంలో లబ్ధిదారులకు అందించే కార్యక్రమాన్ని చేపట్టాలని కోరారు.

రెండు పంటలకు నీరివ్వండి..

● ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి



నరసన్నపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండు పంటలకు సాగునీరు ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కోరారు. గురువారం అసెంబ్లీ సమావేశంలో వ్యవసాయ పద్దుపై ఆయన ప్రసంగించారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో వ్యవయసాయ రంగం దెబ్బతిందని, కూటమి అధికారంలోకి రావడంతో రైతులు సంతోషంగా ఉన్నారని అన్నారు. సకాలంలో ధాన్యం కొనుగోలు చేసి.. రైతులకు పదిగంటల వ్యవధిలో డబ్బులు చెల్లించామన్నారు. జిల్లాలో పెసర, మినప కారణంగా 10-15 శాతం ధాన్యం పొలాల్లోనే ఉందని, వాటిని కొనుగోలు చేయాలని కోరారు. రైతులకు అవసరమైన యంత్ర పరికరాలను అందజేయాలన్నారు. గత ప్రభుత్వం సాగునీటి కాలువలను, వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేయడంతో రైతులు ఎన్నో ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. వంశధార ప్రాజెక్టుకకు సంబంధించి 95 శాతం పనులు గత టీడీపీ ప్రభుత్వం హయాంలోనే పూర్తయ్యాయని, వైసీపీ ప్రభుత్వ హయాంలో కాలువల్లో పిడికెడు మట్టి కూడా తీయలేదని విమర్శించారు. మిగిలిన 5శాతం పనులు పూర్తి చేసి జిల్లాను సస్యమలం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. గ్రామాలను అనుసంధానం చేస్తూ రోడ్లు వేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు.

రాగి.. ఆరోగ్యానికి మేలు



లింగాలవలసలో సాగు చేస్తున్న రాగిపంట



● నాడు పేదింట్లోనే జావ.. నేడు అందరి ఇళ్లలోనూ..
● జిల్లాలో ప్రతిఏటా పెరుగుతున్న సాగు విస్తీర్ణం

జలుమూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రాగి (చోడి) పంట సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. నాడు పేదవాని ఆకలి తీర్చే రాగి జావ నేడు ప్రతి ఇంట్లోనూ కనిపిస్తోంది. రాగిజావ ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూరుస్తుండడంతో చాలామంది విధిగా ఉదయంపూట తాగుతున్నారు. రాగులు ప్రోటీన్లు కలిగి ఉండి షుగర్, బీపీ తదితర వ్యాధుల నియంత్రణకు దోహదపడుతుంది. ఉదయం లేవగానే రాగిజావ తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు. ఆరోగ్యం బాగలేక డాక్టరు వద్దకు వెళ్లినా ముందుగా చెప్పేది ఉదయాన్నే రాగిజావ తీసుకోవాలని సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాగులుకు గిరాకీ పెరిగింది. కేజీ రు.30 నుంచి రు.40 ధర పలుకుతోంది. దీంతో రైతులు కూడా చోడి పంట సాగుకు ఆసక్తి చూపుతున్నారు. ఆరుతడి పంటగా వేస్తున్నారు. తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం వస్తుండడంతో రైతులకు ఆదాయం వస్తోంది. జలుమూరు, లింగాలవలస, రాణ, ఏనేటికొత్తూరు, రావిపాడు, ఎర్రన్నపేట, సంతలక్ష్మిలి, రామచంద్రాపురం, సుబ్రమణ్యపురం తదితర గ్రామాల్లో చోడి ఎక్కువగా సాగు చేస్తున్నారు. గత ఏడాది జిల్లాలో 3272 ఎకరాల్లో చోడిసాగు చేయగా ఈ ఏడాది 3500 ఎకరాల్లో పంట వేశారని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు.

ఎకరాకు రూ.50 వేల ఆదాయం..



ఎకరా విస్తీర్ణంలో చోడి సాగు చేస్తే రూ.50వేల ఆదాయం వస్తుందని చెబుతున్నారు ఎకరాకు 15 బస్తాలు పైచిలుకు దిగుబడి వస్తుంది. బస్తా రూ.3300 ధర పలుకుతోంది. కొంతమంది రైతుల ఇళ్లకు వచ్చి తీసుకెళ్తున్నారు. గత ఏడాది అర ఎకరాలో చోడి సాగు చేసాను. ఈ ఏడాది ఎకరా వేస్తున్నాను.

-కూన కూర్మారావు, కూనలచ్చన్నాయుడుపేట

తక్కువ ఖర్చుతో మంచి ఆదాయం..



చోడి ఆరుతడి పంటగా వేస్తే తక్కువ ఖర్చుతో మంచి ఆదాయం వస్తుంది. పంటకు 3 తడులు నీరు కడితే సరిపోతుంది. పంట కల్లాలకు చేరేసరికి చాలామంది కావాలని అడుగుతున్నారు. కేజీ రూ.30 నుంచి రూ.35 ధర పలుకుతోంది. షుగర్, బీపీ రోగులు చోడి అంబలి తాగుతున్నారు. ప్రభుత్వం చోడి రైతులకు రాయితీలు అందిస్తే మరింత విస్తీర్ణంలో సాగుకు ముందుకు వస్తారు.

-కొర్ను అప్పన్న, గంగాధరపేట

రాగి జావతో షుగర్, బీపీ నియంత్రణ..



నేను గుండె ఆపరేషను చేసుకుని 10 ఏళ్లు అవుతుంది. అప్పటినుంచి రోజూ ఉదయం రాగిజావ తీసుకుంటున్నాను. దీంతో షుగర్, బీపీ కూడా కంట్రోల్‌లో ఉంటున్నాయి. నా ఆరోగ్యం మెరుగుపడింది. నా వయస్సు 60 ఏళ్లు పైబడినా వ్యవసాయ పనులు సునాయాసంగా చేసుకుంటున్నాను.

-కూన అప్పారావు, అబ్బాయిపేట

ప్రాసెసింగు యూనిట్ అందిస్తే సాగు పెరిగే అవకాశం..



చోడి పంటకు తొక్క తీయుటకు సరైన పరికరాలు లేకపోవడంతో రైతులు అనేక అవస్థలు పడుతున్నారు. రైతులకు రాయితీపై ప్రాసెసింగు యూనిట్ అందిస్తే మరింతమంది రైతులు చోడి సాగుకు ముందుకు వస్తారు. ఏటేటా జిల్లాలో చోడి సాగు పెరుగుతోంది. షుగర్, బిపి రోగులకు రాగిజావ ఔషదంగా ఉపయోగ పడడంతో చోలు వినియోగం పెరుగుతోంది.

-కె.సురేష్, వ్యవసాయాధికారి, జలుమూరు మండలం

ఆ ముగ్గురికీ పట్టాలెలా ఇస్తారు?

(ఐదో పేజీ తరువాయి)

తన ఇద్దరు భార్యలకు, అన్న కొడుకుకు ప్రభుత్వం ఇచ్చిన పట్టా భూమిగా చూపించాడు. చట్ట ప్రకారం ఓ ప్రభుత్వ ఉద్యోగికి కానీ, అతడి భార్యకు కానీ పట్టా ఇవ్వడానికి లేదు. అలాగే పెళ్లి కాని యువకుడికి పట్టా ఇవ్వరు. కానీ విద్యుత్‌శాఖ ఉద్యోగి మాత్రం గతేడాది జనవరి 30న తన ఇద్దరు భార్యలతో పాటు 21 ఏళ్ల పెళ్లి కాని తన అన్న కొడుకు పేరు మీద సర్వే నెంబర్ 360లో 2,700 చదరపు అడుగుల చొప్పున మూడు పట్టాలు పొందినట్లు తహసీల్దార్ విచారణలో పేర్కొన్నారు. దీనిపై ప్రస్తుత తహసీల్దార్ గణపతిరావు స్పందిస్తూ.. ప్రభుత్వ ఉద్యోగి భార్యలకు, పెళ్లి కాని వ్యక్తికి పట్టాలు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. తక్షణమే నిర్మాణాలు ఆపాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సచివాలయ ఉద్యోగులు నోటీసులు జారీచేశారు. కాగా.. నోటీసులు జారీచేసిన తమపై నిర్మాణదారులు బెదిరింపులకు పాల్పడుతున్నారని తహసీల్దార్‌కు ఉద్యోగులు విన్నవించారు. చుట్టూ టార్పాలిన్లు కట్టి.. రాత్రివేళ నిర్మాణాలు చేపడుతున్నారని తెలిపారు. నోటీసులు ఇస్తే కోర్టును ఆశ్రయిస్తున్నాడని, న్యాయస్థానం ఎటువంటి ఆదేశాలు ఇవ్వకపోయినా నిర్మాణాలు కొనసాగిస్తున్నారని వివరించారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పందిస్తే తప్ప.. ఈ ఆక్రమణలకు అడ్డుకట్ట పడదని స్థానికులు పేర్కొంటున్నారు. ఆక్రమణకు గురైన కొండపోరంబోకు స్థలాన్ని కలెక్టర్ పరిశీలించి.. పూర్తిస్థాయి విచారణ చేయాలని కోరుతున్నారు.

● ఈ విషయమై తహసీల్దార్ గణపతిరావు వద్ద ప్రస్తావించగా.. కొండపోరంబోకు స్థలం ఆక్రమణలపై విచారణ చేశామని తెలిపారు. గతంలో నోటీసులు కూడా ఇచ్చామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సంక్షేమ బాట

(ఐదో పేజీ తరువాయి)

ఏడాదికి రూ.15వేలు అందిస్తామని చెప్పింది. కానీ, రూ.14వేలు, రూ.13వేలకు కుదించి పిల్లల తల్లులకు అందించింది.

మత్స్యకార భరోసా..

మత్స్యకారులకు అందించే వేట నిషేధ భృతిని కూటమి ప్రభుత్వం రెట్టింపు చేసింది. ఏటా ఏప్రిల్ 14 నుంచి రెండు నెలలపాటు వేట నిషేధం ఉంటుంది. ఆ సమయంలో మత్స్యకారులకు భృతి కింద రూ.10వేలు అందించేవారు. దీన్ని రూ.20వేలకు పెంచుతామని ఎన్నికల్లో చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ మేరకు మత్స్యకార భరోసాకు రూ.450 కోట్లు బడ్జెట్‌లో కేటాయించారు. జిల్లాలో ఇచ్ఛాపురం మండలం డొంకూరు నుంచి రణస్థలం మండలం దోనిపేట వరకూ దాదాపు 11 మండలాల పరిధిలో 193 కిలోమీటర్ల మేర తీరం ఉంది. 110 వరకూ మత్స్యకార గ్రామాలు ఉన్నాయి. దాదాపు లక్ష కుటుంబాలు నివసిస్తున్నాయి. ఎక్కువ మంది స్థానికంగా వేట గిట్టుబాటుకాక.. ఇతర ప్రాంతాలకు వలసపోతున్నారు. పడవల నమోదు, ఇతర నిబంధనలు అనుసరించి 15,428 మందికి మత్స్యకార భరోసా అందే అవకాశం ఉంది.



నిరసన తెలుపుతున్న వీవోఏలు

వీవోఏలపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

● సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా

శ్రీకాకుళం కలెక్టరేట్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): వెలుగు వీవోఏల పట్ల అనుచితంగా, అవమానకరంగా మాట్లాడిన డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్ క్షమపణ చెప్పాలని ఆ సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం వందాలది మంది వీవోఏలు తరలివచ్చి కలెక్టరేట్ సమీపంలోని డచ్‌బంగ్లా వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వీవోఏల మనోభావాలను కించపరిచేలా పీడీ మాట్లాడారని, రాష్ట్రంలోనే జిల్లాను రెండో స్థానంలో నిలిపినందుకు ఇదేనా మాకు ఇచ్చిన బహుమతి అంటూ మండిపడ్డారు. మహిళలను కించపరుస్తూ మాట్లాడడం బాధాకరమన్నారు. వీవోఏలుగా 90 శాతం మంది మహిళలే ఉన్నారని, వారు తక్కువ వేతనంతో విశ్రాంతి లేకుండా పని చేస్తున్నారని తెలిపారు. అనంతరం యూనియన్ నాయకులు డీఆర్డీఏ కార్యాలయానికి చేరుకుని పీడీతో పోలీసుల సమక్షంలో చర్చలు జరిపారు. పీడీ మాటలతో సంతృప్తి చెందని వారు ర్యాలీగా కలెక్టరేట్ గేటు వద్దకు చేరుకుని ఆందోళన చేశారు. అయితే మళ్లీ యూనియన్ నాయకులను పీడీ పిలిపించుకుని మాట్లాడారు. వీవోఏలను గౌరవిస్తానని, వారితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడుతానని, ఏపీఎంలు, సీసీలు వీవోఏలపై మార్యాదపూర్వకంగా వ్యవహరిస్తానని చెప్పడంతో వారంతా ఆందోళన విరమించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు వి.ధనలక్ష్మి, జి.అసిరినాయుడు, సీఐటీయూ నాయకులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, కె.సూరయ్య పాల్గొన్నారు.

పేదరికం లేని సమాజ నిర్మాణమే లక్ష్యం

● 8 నుంచి 15వ తేదీ వరకు పీ-4 సర్వే ● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



శ్రీకాకుళం కలెక్టరేట్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): పేదరికం లేని సమాజ నిర్మణమే లక్ష్యంగా పబ్లిక్, ప్రైవేట్, పీపుల్ పార్టనర్‌షిప్ (పీ-4) సర్వేకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ రూపొందించిందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గురువారం ఒక ప్రటకనలో పేర్కొన్నారు. ఈ సర్వే కోసం ప్రత్యేకంగా రూపొందించిన మొబైల్ యాప్‌ను వినియోగించి ఈ నెల 8వ తేదీ నుంచి గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ద్వారా సర్వే ప్రారంభించి 15వ తేదీ నాటికి పూర్తి చేయిస్తామన్నారు. ఈ సర్వేపై మార్చి 6, 7 తేదీల్లో ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు తమ పరిధిలోని గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పించేందుకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పేదరికాన్ని దూరం చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా చేపడుతున్న కార్యక్రమాలకు అదనంగా సామాజికంగా, ఆర్థికంగా ఉన్నత స్థాయిలో ఉన్న కుటుంబాలు తమ సామాజిక బాధ్యతగా అట్టడుగున ఉన్న కుటుంబాలకు మద్దతుగా నిలిచేలా ప్రోత్సహించడం ఈ పీ-4 విధానం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. పేదల అవసరాలను గుర్తించి వారి సమగ్రాభివృద్ధికి అవసరమైన ప్రాజెక్టుల రూపకల్పనకు ఈ సర్వే దోహదపడుతుందని తెలిపారు. ప్రస్తుతం కుటుంబాలు అందుకుంటున్న పథకాలపై ఈ సర్వే ఎలాంటి ప్రభావం చూపబోదని, ఈ సర్వే ద్వారా సేకరించిన డేటా ఆధారంగా కుటుంబ అవసరాలకు అనుగుణంగా సమర్థవంతమైన ప్రణాళికలు రూపొందించవచ్చన్నారు. ఈ సర్వేపై ప్రజల్లో నెలకొన్న అపోహలను తొలగించి అన్ని శాఖల సమన్వయంతో, సమష్టి భాగస్వామ్యంతో సర్వేను విజయవంతంగా పూర్తి చేసేందుకు కృషి చేయాలని అధికారులకు పిలుపునిచ్చారు.

కొన్నారా.. మోసపోతారు!

● తాళ్లవలసలో అక్రమ లేఅవుట్లు ● పరిశ్రమలొస్తున్నాయంటూ ప్రచారం
● రూ. లక్షలకు అమ్ముకుంటున్న రియల్టర్లు



తాళ్లవలసలో వెలిసిన అక్రమ లే-అవుట్

సంతబొమ్మాళి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లవలసలో అనుమతులు లేకుండా అక్రమ లే అవుట్లు వేస్తున్నారు. ప్లాట్లు వేసి రూ.లక్షలకు అమ్ముకుంటున్నారు. రియల్‌ఎస్టేట్ వ్యాపారులు ఇంతచేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. రెయ్యిపేట-తాళ్లవలస డబుల్ రోడ్డు పక్కన తాళ్లవలస గ్రామ సమీపంలోని మూడు సర్వే నెంబర్లలో రియల్టర్లు అక్రమ లే-అవుట్ వేశారు. రోడ్డు పక్కన ఉన్న పంటపొలాలను కొనుగోలు చేసి వాటిలో మట్టిని పోసి ప్లాట్లుగా విభజించి అమ్మేస్తున్నారు. వ్యవసాయ భూమిని లే-అవుట్‌గా వేయాలంటే ముందుగా వ్యవసాయేతర భూమిగా మార్చుకోవాలి. తర్వాత సుడా నుంచి అనుమతులు పొందాలి. లే-అవుట్‌లో పది శాతం భూమిని అవసరాలకు విడిచిపెట్టాలి. అలాగే లే-అవుట్‌లో నలభై అడుగుల రోడ్డును నిర్మించాల్సి ఉంటుంది. అయితే రియల్టర్లు ఇవేవీ చేయకుండా నిబంధనలను ఉల్లంఘించి లేఅవుట్లు వేశారు. కొంతమంది ఏజెంట్లను నియమించుకుని వాటిని విక్రయిస్తున్నారు. నిబంధనల గురించి అవగాహన లేని స్థానికులు వీటిని కొనుగోలు చేసి మోసపోతున్నారు. మూలపేటలో గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నిర్మాణం జరుగుతుండంతో ఈ ప్రాంతానికి పరిశ్రమలు వస్తాయని, భూముల ధరలు అమాంతం పెరిగిపోతాయంటూ రియల్టర్లు ఆశచూపుతున్నారు. టెక్కలికి చెందిన కొంతమంది వ్యాపారులు మండలంలో పాగా వేసి ఇలాంటి మోసాలకు పాల్పడుతున్నారు. ప్లాట్లు అమ్మించిన ఏజెంట్లకు కమీషన్లు ముట్టజెబుతున్నారు. మండల పరిషత్ అధికారులు కూడా చోద్యం చూస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సుడా అధికారులు స్పందించి అక్రమ లే-అవుట్లపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. అక్రమ లే-అవుట్లపై తాళ్లవలస పంచాయతీ కార్యదర్శి విజయకుమార్ వివరణ కోరగా వీటికి పంచాయతీ అనుమతులు లేవని, దీని గురించి సుడా అధికారుల దృష్టికి తీసుకువెళతామని తెలిపారు.

పలాసలో జామి ఎల్లమ్మ జాతర ప్రారంభం

● పోతురాజులతో ఊరేగింపు ● దారిపొడవునా భక్తుల పూజలు

పలాస, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పలాసలో జామి ఎల్లమ్మ జాతరకు మొదటి ఘట్టం గురువారం ప్రారంభమయ్యింది. మధ్యాహ్నం 12 గంటల నుంచి అమ్మవారిని పోతురాజుల ఊరేగింపు కార్యక్రమాన్ని పలాస నుంచి తర్లాకోట జమిందారుల ఇంటి వరకూ నిర్వహించారు. తొలుత అమ్మవారి జంగెడను, పోతురాజుల వేషధారులను సిద్ధం చేశారు. అనంతరం అమ్మవారికి మేళతాళాలు, డప్పు వాయిద్యాలతో ఆలయం నుంచి బయటకు తీసుకువచ్చి ఊరేగించారు. దారిపొడవునా అమ్మవారి జంగెడకు భక్తులు పూజలు చేశారు. అమ్మవారి ఆలయంలో ఎల్లమ్మ ఉత్సవ విగ్రహంతోపాటు పోతురాజుల విగ్రహాలకు భక్తుల విరాళాలతో తయారు చేయించిన వెండి తొడుగులు అమర్చారు. శనివారం జామి యాత్ర నిర్వహణ జరుగుతుండడంతో ముందుగానే అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకోవడం విశేషం. ఈ మేరకు ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యుత్ దీపాలు అమర్చుతున్నట్లు మునిసిపల్ కమిషనర్ ఎస్.రామారావు తెలిపారు.



పోతురాజు విగ్రహాలకు వెండి తొడుగులతో అలంకరించిన దృశ్యం..



అమ్మవారి దారు విగ్రహాల జంగెడను ఊరేగింపుగా తీసుకువెళ్తున్న పోతురాజు వేషధారణలో ఉన్న భక్తులు

మార్చిలోనే భగభగలు

(ఐదో పేజీ తరువాయి)

38.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే జిల్లాలో ఏడు మండలాల్లో వడగాల్పులు వీచాయి. అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సాయంత్రా నికి కాస్త చల్లగాలులతో కాస్తంత ఉపశమనం లభిస్తోంది. పగటిపూట మాత్రం భానుడి ప్రతాపంతో తట్టుకోలేని పరిస్థితి. అలాగే శుక్రవారం 9 మండలాల్లో, శనివారం 5 మండలాల్లో వడగాల్పులు ఉంటాయని ఏపీ ఎస్‌డీఎంఏ హెచ్చరించింది. గురువారం ఆమదాలవలస, బూర్జ, హిరమండలం, గార, ఎల్ఎన్ పేట, పొందూరు, సారవకోట, సరుబుజ్జిలి మండలాల్లో అధిక ఉష్ణోగ్రతలు కారణంగా వడగాల్పులు వీచాయి.

ప్రతిఏటా మే నెలలో..

ప్రతిఏటా మే నెలలో భానుడి భగభగలు ఉండేవి. అంతవరకు సాధారణ ఉష్ణోగ్రతలే నమోదయ్యేవి. ఇప్పుడు మార్చి నెలలోనే మధ్యాహ్నం 12 గంటలకు రోడ్లపై ప్రజలు తిరగలేక పోతున్నారు. ఎండవేడిమిని తట్టు కోలేక.. వేగంగా పనిముగించుకుని ఇళ్లకు పరిమితమవుతున్నారు. వాతా వరణంలో గాలి వేడెక్కడంతో వడగాల్పులు అంతటా వీస్తున్నాయి. ఇప్పుడే ఎండలు ఇలా ఉంటే.. ఏప్రిల్, మే నెలల్లో ఎలా భరించాలని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గత ఐదేళ్లలో చెట్లను నరికివేయడం.. నీటిని ఆదా చేయకపోవడం.. పైగా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవ డం.. -5శాతం వర్షపాతం.. వంటి కారణాలతో ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయి.

హోటళ్లలో సబ్సిడీ సిలిండర్లు

(ఐదో పేజీ తరువాయి)

పట్టణంలో, పెట్రోల్ బంకు, కంబకాయి జంక్షన్, కొత్తబస్టాండ్, ఆర్టీసీ కాంప్లెక్స్, బజారువీధి, పాతబస్టాండ్, జమ్ము జంక్షన్ తదితర హోటల్స్‌లో రోజూ పదుల సంఖ్యలో సబ్సిడీ సిలిండర్లనే వినియోగిస్తున్నారు. డాబాల్లో కూడా ఇదే పరిస్థితి. వీటిని నియంత్రించాల్సిన సివిల్ సప్లయ్ శాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

దర్జాగా రీ ఫిల్లింగ్..

నరసన్నపేటలో గ్యాస్ రీఫిల్లింగ్ దర్జాగా కొనసాగుతోంది. చాలామంది వ్యాపారులు పెద్ద సిలిండర్ల నుంచి గ్యాస్ రీ ఫిల్లింగ్ చేస్తున్నారు. కేజీకి రూ.వంద వరకు చిన్న చిన్న సిలిండర్లు కూడా రీఫిల్లింగ్ చేసి విక్రయిస్తున్నారు. కొన్ని హోటల్స్ యాజమానులు కమర్షియల్ సిలిండర్‌లో గృహ అవసరాలు సిలెండర్లు నుంచి గ్యాస్‌ను రీఫిల్లింగ్ చేస్తున్నారు. అలాగే కొందరు వ్యాపారులు వంటకు వినియోగించే గ్యాస్‌ను ఎల్‌పీజీ వాహనాలు కూడా అనధికారికంగా పట్టణంలో ఫిల్లింగ్ చేస్తున్నారు.

వాణిజ్య సిలిండర్లును వినియోగించాలి..

హోటల్స్‌లో వాణిజ్య గ్యాస్ సిలిండర్లే వినియోగించాలి. గృహ అవసర సిలిండర్లు వినియోగించే వారిపై చర్యలు తీసుకుంటాం. గ్యాస్ ఏజెన్సీలు కూడా నిబంధనలుపాటించాలి. డోర్ డెలివరీకి ఎటువంటి అదనపు చార్జీలు వసూళ్లు చేయరాదు.

-రామకృష్ణ, సివిల్ సప్లయ్ శాఖ డీటీ, నరసన్నపేట

'నవోదయం 2.0'తో.. సారా రహిత సిక్కోలు

● ఆరు ప్రాంతాల్లో 110 సారా తయారీ కేంద్రాల గుర్తింపు

● ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి


మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి

శ్రీకాకుళం క్రైం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): జిల్లాను సారా రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు నవోదయం 2.0 కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో సారాను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముఖ్యంగా సోంపేట, టెక్కలి, పలాస, కొత్తూరు, పాతపట్నం, ఇచ్ఛాపురం పరిధిలో ఏ,బీ,సీ కేటగిరీలుగా 110 సారా తయారీ కేంద్రాలను గుర్తించామన్నారు. ఈ ప్రాంతాల్లో ఎక్సైజ్ అధికారులను అడాప్షన్ అధికారులుగా నియమించామని వివరించారు. ఈ ఆరు ప్రాంతాల్లో ఐదు స్టేజీలుగా విడదీసి గ్రామాల్లో ప్రజలకు సారా వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తామన్నారు. అలాగే సారా తయారీ చేసే వ్యక్తులు, తరలించే వారు, విక్రయించే వారిని గుర్తించి వారి వివరాలు సేకరిస్తామన్నారు. గ్రామ, మండల స్థాయిలో రెవెన్యూ, పోలీసులు, అటవీశాఖాధికారులు, వీఆర్వోలు, సర్పంచ్‌లు, ఎన్జీవోలతో కలిసి కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కమిటీల ద్వారా సారా వల్ల కలిగే దుష్ప్రభావాలపై ప్రజలకు, బెల్లం సరఫరా చేసే వ్యాపారులకు అవగాహన కల్పిస్తామన్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా రూ.వెయ్యికి పైగా పాత ముద్దాయిలను బైండోవర్లు కట్టామన్నారు. రెండోసారి సారాతో పట్టుబడితే కోర్టులో హాజరుపరచడంతో పాటు వారితో రూ.50వేలు నుంచి రూ.లక్ష వరకు జరిమానా విధిస్తామన్నారు. సారా రహిత జిల్లాకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

బైక్‌పై లిఫ్ట్ ఇచ్చాడు.. పుస్తెలతాడు దోచాడు

జి.సిగడాం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఓ వృద్ధురాలి మెడలోని బంగారం పుస్తెలతాడు చోరీ జరిగిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మద్రివలస గ్రామానికి చెందిన పలిశెట్టి కన్నమ్మ మానంపేట గ్రామానికి నడుచుకొని వెళ్తుండగా.. అటువైపు బైక్‌పై వస్తున్న గుర్తుతెలియని వ్యక్తిని లిఫ్ట్ అడిగింది. దీంతో ఆ వ్యక్తి తన బైక్‌పై కన్నమ్మను ఎక్కించుకుని మానంపేట గ్రామ సమీపంలో దింపేశాడు. అక్కడి నుంచి కన్నమ్మ నడుకుని వెళ్తుండగా.. లిఫ్ట్ ఇచ్చిన ఆ వ్యక్తి వెనుక నుంచి వచ్చి వృద్ధురాలి ముఖంపై కారం జల్లి మెడలో ఉన్న తులంన్నర బంగారు పుస్తెలతాడు తెంపుకుని వెళ్లిపోయాడు. దీంతో ఆమె మెడకు చిన్నచిన్న గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న రణస్థలం సీఐ అవతారం, ఎస్‌ఐ మధుసూధనరావు ఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. ఎస్‌ఐ కేసు నమోదు చేశారు.

యువకుడి అదృశ్యం


అదృశ్యమైన శంకర్

బూర్జ, మార్చి 6(ఆంధ్రజ్యోతి): పాలవలస గ్రామానికి చెందిన అల్లాడ శంకర్ (30) ఈ నెల మూడో తేదీ నుంచి కనిపించడం లేదని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ ప్రవల్లిక తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు.. శంకర్ శ్రీకాకుళంలోని ఓ మోటారు ఫైనాన్స్ కంపెనీలో లోన్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో చాలా వరకు అప్పులు చేశాడు. అప్పులు ఇచ్చినవారి ఒత్తిడి తట్టుకోలేక ఇళ్లు వదిలి వెళ్లిపోయి ఉంటాడని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్‌ఐ తెలిపారు.

అప్రమత్తంగా ఉండాలి

ఆమదాలవలస, మార్చి 6(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సీఎఫ్ఎల్ కో-ఆర్డినేటర్ చిగురుపల్లి వెంకటేష్ (చిన్ను) అన్నారు. గురువారం మండలంలోని కొర్లకోట గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు యూనియన్ బ్యాంకు మేనేజర్ సౌజన్యంతో ఎస్ఎస్‌టీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పొదుపు చేయాలన్నారు. బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామని, ఎవరైనా ఫోన్ చేసి ఏటీఎం పిన్ కార్డు బ్యాంకు అకౌంట్ వివరాలను అడిగితే ఎటువంటి వివరాలు చెప్పవద్దన్నారు. ఎవరైనా సైబర్ మోసాలకు గురైనప్పుడు 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు, ఇంట్రిగేటెడ్ అంబుడ్స్‌మెన్ టోల్ ఫ్రీ నెంబరు 14448కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ జిల్లా కో-ఆర్డినేటర్ ఎ.హరనాథ్, లీడ్‌బ్యాంకు ఎఫ్ఎల్‌సీ రవిబాబు, ఫీల్డ్ అసిస్టెంట్ గురుగుబిల్లి లత, సీఎఫ్ఎల్ సిబ్బంది పాల్గొన్నారు.

10.25 కిలోల గంజాయి స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటప్పారావు

కవిటి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఒడిశా రాష్ట్ర గంజాం జిల్లా లాటీ గ్రామానికి చెందిన సురేష్ నాయక్ 10.25 కిలోల గంజాయితో పోలీసులకు గురువారం పట్టుబడ్డాడు. డీఎస్పీ వెంకటప్పారావు తెలిపిన వివరాల మేరకు.. సురేష్ తన ఆర్థిక పరిస్థితిని స్నేహితుడైన గంజాయి వ్యాపారి రాజేంద్ర బాడిత్యతో చెప్పాడు. దీంతో గంజాయిని బెంగుళూరు తీసుకుని వెళ్లి తాను చెప్పిన వ్యక్తికి అప్పగిస్తే కిలోకి రూ.1000 ఇస్తానని చెప్పాడు. ఇందుకు అంగీకరించిన సురేష్ గతేడాది ఆగస్టులో రాజేంద్ర బాడిత్య చెప్పినట్టుగా గంజాయి తీసుకుని వెళ్లి బెంగుళూరులో ఇచ్చాడు. ఇక అప్పటి నుంచి రాజేంద్ర చెప్పిన చోటికి గంజాయిని చేరవేయడం మొదలుపెట్టాడు. ఈ క్రమంలో గురువారం ఒడిశా రాష్ట్రం బరంపురంలో కొనుగోలు చేసిన 10.25 కిలోల గంజాయిని తీసుకొని బస్సులో కొజ్జిరియా టోల్‌గేట్ ముందు గల ఓవర్ బ్రిడ్జి వద్ద బస్సు దిగాడు. అక్కడ నుంచి కంచిలి రైల్వేస్టేషన్‌కు వెళ్లేందుకు కొజ్జిరియా జంక్షన్ వద్ద బస్సు ఎక్కుతుండగా పోలీసులు పట్టుకుని విచారించి పై వివరాలు రాబట్టారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కార్యక్రమంలో సీఐ ఎం.చిన్నమనాయుడు, ఎస్‌ఐ రవివర్మ పాల్గొన్నారు.

ఒడిశా టు ఎన్టీఆర్ జిల్లా

ఇచ్ఛాపురం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఒడిశా రాష్ట్రం బరంపురం నుంచి ఏపీలోని ఎన్టీఆర్ జిల్లాకు గంజాయిని తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను పట్టణ పోలీసులు పట్టుకున్నారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఇందుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ వెంకటప్పారావు గురువారం తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీపట్నానికి చెందిన ముగ్గురు యువకులు కంబాల సూర్య, కలపాత తేజ, వంశీ గంజాయికి బానిసగా మారారు. ఈ క్రమంలో ఒడిశాలో గంజాయి కొనుగోలు చేసి ఇచ్ఛాపురం నుంచి రైలులో వెళ్లేందుకు ప్రయత్నించారు. వీరిపై అనుమానం రావడంతో పోలీసులు తనిఖీ చేయగా సుమారు 1.5 కిలోల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సీఐ మీసాల చిన్నమనాయుడు, పట్టణ ఎస్‌ఐ ముకుందరావు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

గుజరాతీపేట, మార్చి 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతవంతంగా సాగుతున్నాయి. గురువారం మొదటి సంవత్సరం గణితం 1-ఎ, బోటనీ, సివిక్స్‌కు సంబంధించి పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షలకు జనరల్‌లో 21,156 మందికి గాను 20,429 మంది హాజరు కాగా, 727 మంది హాజరు కాలేదు. ఒకేషనల్ కు సంబంధించి 1,342 మందికిగాను 1,254 మంది హాజరు కాగా 88 మంది గైర్హాజరయ్యారు. మొత్తం మీద 22,498 మందికి 21,683 మంది హాజరు కాగా 815 మంది గైర్హాజరయినట్లు అధికారులు పేర్కొన్నారు. ఎటువంటి మాల్ ప్రాక్టీస్ జరగలేదని అధికారులు ధృవీకరించారు.

నేడు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

పొందూరు/ రణస్థలం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం డివిజన్ పరిధిలో విద్యుత్ వినియోగదారుల సమస్యలపై ఈ నెల 7న పొందూరు సబ్‌స్టేషన్ వద్ద పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్టు సీజీఆర్ఎఫ్ చైర్మన్ బి.సత్యనారాయణ, విద్యుత్‌శాఖ ఈఈ పి.యోగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉంటుందన్నారు. ఈ వేదికలో పొందూరు, సిగడాం, లావేరు, ఎచ్చెర్ల, రణస్థలం, పైడిభీమవరం సెక్షన్ల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు పాల్గొని తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు.

సమాచారం ఇవ్వండి

శ్రీకాకుళం అర్బన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): నగరంలో వ్యాయామం కోసం బహిరంగ ప్రదేశాల్లో ఒంటరిగా సంచరించే మహిళలు అప్రమత్తంగా ఉండాలని మహిళా పోలీసు స్టేషన్ హెచ్‌సీ ఉమారాణి, పీసీ చక్రధరరావు సూచించారు. స్థానిక పొన్నాడ బ్రిడ్జి సమీపంలో గురువారం సాయంత్రం స్టేషన్ సిబ్బంది విజబుల్ పోలీసింగ్‌లో భాగంగా ప్రజలకు నేరాల నుంచి అప్రమత్తంగా ఉండటంపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం దొంగల బెడద ఎక్కువైనందున అనుమానితులు తారసపడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, లేకుంటే 112, 100కి సమాచారం అందించాలని కోరారు.

10న అప్రంటీస్ మేళా

ఎచ్చెర్ల, మార్చి 6(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 10న ప్రధానమంత్రి జాతీయ స్థాయి అప్రంటీస్ మేళా నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ ఎల్.సుధాకరరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులు అర్హులని, అర్హత పత్రాలు, జెరాక్స్ కాపీలతో కూడిన మూడేసి సెట్ల బయోడేటాతో హాజరు కావాలన్నారు.

పవన్ కల్యాణ్‌ను విమర్శించే అర్హత జగన్‌కు లేదు


మాట్లాడుతున్న పార్టీ ఇన్‌చార్జి విశ్వక్సేన్

రణస్థలం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను విమర్శించే అర్హత మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి లేదని ఎచ్చెర్ల నియోజకవర్గం జనసేన పార్టీ అధ్యక్షుడు విశ్వక్సేన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఓ కల్యాణ మండపంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జైల్ ఖైదీకి ఎక్కువ రాజకీయ నాయకుడికి తక్కువ అర్హత ఉన్న జగన్‌రెడ్డి నిజాయతీ కలిగిన పవన్‌కల్యాణ్‌ను విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. క్యారెక్టర్ లేని దువ్వాడ శ్రీనివాసరావు పవన్ కల్యాణ్‌ను విమర్శించే స్థాయి లేదన్నారు. ఈ సందర్భంగా పిఠాపురంలో జరగనున్న జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో పార్టీ అర్జున్ భూపతి, బస్వా గోవిందరెడ్డి, తమ్మినేని శ్రీను, వడ్డాది శ్రీను, బొంతు విజయ్‌కుమార్, టి.పైడిరాజు, దాసరి బలరామ్, వీరమహిళ స్వన్న

ప్రజలు బుద్ధి చెప్పినా జగన్ తీరు మారలేదు

బూర్జ, మార్చి 6(ఆంధ్రజ్యోతి): గడిచిన సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీకి ప్రజలు బుద్ధి చెప్పినా జగన్ తీరు మారలేదని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్ల జయరాం ధ్వజమెత్తారు. విలేకరులతో ఆయన గురువారం మాట్లాడారు. తమ పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై జగన్‌రెడ్డి మాట్లాడిన తీరు సరికాదన్నారు. పవన్ కల్యాణ్‌కు ఏ విషయంలోనూ జగన్‌రెడ్డి సరిపోరన్నారు. అవినీతిలో కూరికుపోయిన జగన్‌రెడ్డికి పవన్ కల్యాణ్‌పై మాట్లాడే అర్హత కూడా లేదన్నారు. ఇప్పటికైనా మాజీ సీఎం తన మాటలను వెనక్కి తీసుకోవాలని లేదంటే జనసైనికుల ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు.

లైంగిక వేధింపుల నియంత్రణ అందరి బాధ్యత

అరసవల్లి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): పిల్లలపై లైంగిక వేధింపులు జరగకుండా జాగ్రత్తగా చూసుకోవాలని, ఇది మనందరి బాధ్యత అని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బాలమురళీకృష్ణ అన్నారు. నగరంలోని జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో వేధింపుల నివారణపై ఒక రోజు అవగాహన కార్యక్రమం గురువారం జరిగింది. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ.. లైంగిక దాడులకు పాల్పడిన వారిని చట్ట ప్రకారం శిక్షించేందుకు కఠినమైన చట్టాలు ఉన్నాయన్నారు. శిక్షకుడు ఉదయ్‌కుమార్, సైకాలజిస్ట్ రాజ్‌కుమార్ వివరించారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ వెంకటరావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ మేరీ కాథరీన్, డీపీఎంవో వాన సురేష్‌కుమార్, వైద్యాధికారులు ఐసీడీఎస్ శాఖ సీడీపీవోలు, ప్రభుత్వ ఆసుపత్రి మానసిక సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక శక్తిగా ఎదగాలి

అరసవల్లి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం పట్టణంలో నాబార్డు, ఐసీడీఎస్ సంయుక్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని స్థానిక సీడీపీవో కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీడీఎం కె.రమేష్ కృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా ఆరోగ్యం, పోషకాహారం, స్వయం ఉపాధి అభివృద్ధి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగులను, స్వచ్ఛంద సంస్థల మహిళా కార్యకర్తలను సన్మానించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ, డీఆర్డీఏ డీపీఎం శ్రీగౌరి, టి.త్రినేత్రి, కేవీకే శాస్త్రవేత్త శోభారాణి, సీడీపీవో సంధ్యారాణి, డీసీసీబీ మేనేజర్ లలిత, యూనియన్ బ్యాంక్ మేనేజర్ ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

పెన్నులతో పూజ



శ్రీకాకుళం కల్చరల్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): పాలకొండ రోడ్డులో ఉన్న విజయ గణపతి ఆలయంలో గురువారం పెన్నులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు పెంటా శ్రీధర్ శర్మ, సూర్య నగేష్ వర్మ ఆధ్వర్యంలో గణపతి హోమం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త వీనస్ హరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి


ఆటల పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

శ్రీకాకుళం అర్బన్/ అరసవల్లి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించి స్ఫూర్తిదాయకంగా నిలవాలని ఏపీజేఏసీ జిల్లా చైర్మన్ హనుమంతు సాయిరాం ఆకాంక్షించారు. స్థానిక ఎన్జీఓ హోంలో గురువారం సాయంత్రం జేఏసీ మహిళా విభాగం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం పురస్కరించుకుని ఆటలు, పాటల పోటీలు నిర్వహించారు. కలెక్టర్ అనుమతితో గురు, శుక్రవారాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి ఈ పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పోటీల నిర్వహణకు కలెక్టర్ రూ.50 వేలు సాయం అందించారన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి 8న మహిళా దినోత్సవం సందర్భంగా బహుమతులు అందిస్తామన్నారు. ఏపీ పెన్షనర్స్ జేఏసీ చైర్మన్ సీహెచ్ పురుషోత్తం నాయుడు, జేఏసీ కార్యదర్శి శ్రీనివాసరావు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

ఏపీడీ విచారణ


విచారణ చేపడుతున్న ఏపీడీ రాధ

బూర్జ, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఫీల్డ్ అసిస్టెంట్‌పై వచ్చిన ఆరోపణలపై గురువారం ఏపీడీ పంచాది రాధ లాభాం, నారాయణపురం గ్రామాల్లో విచారణ చేపట్టారు. ఫీల్డ్ అసిస్టెంట్ మీసాల గోవిందమ్మపై వచ్చిన ఫిర్యాదులు మేరకు విచారించగా విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. సుమారు 20 మందికి పైగా పనికి రాకున్నా.. వారికి మస్తర్లు వేసి వారి నుంచి సగం వేతనం గోవిందమ్మ తీసుకుంటున్నట్టు పలువురు ఏపీడీకి తెలిపారు. అనంతరం ఏపీడీ మాట్లాడుతూ.. ఫిర్యాదుదారుల సమక్షంలో కూలీలను విచారించగా గోవిందమ్మపై వచ్చిన ఆరోపణలు నిజమని తేలిందన్నారు. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏపీవో శ్రీనివాస్, క్లస్టర్ అసిస్టెంట్ రామకృష్ణ, టెక్నికల్ అసిస్టెంట్ తిరుపతిరావు, కూలీలు పాల్గొన్నారు.

పిఠాపురం సభ విజయవంతం చేయండి

ఇచ్ఛాపురం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో ఈ నెల14న నిర్వహించనున్న జనసేన పార్టీ ఆవిర్భావ సభ విజయవంతం చేయాలని ఆ పార్టీ ఇన్‌చార్జి దాసరి రాజు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం పట్టణ పరిధి వీకే పేట జంక్షన్ వద్ద గల పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించి, సభకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. తిప్పన దుర్యోధన రెడ్డి, రోకళ్ల భాస్కర్ పాల్గొన్నారు.

జిల్లాలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలి


ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న గిరిజన యువత

ఆమదాలవలస, మార్చి 6(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లాలో ఐటీడీఏ ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్‌ను జిల్లాకు చెందిన గిరిజన ప్రాంతాల నాయకులు కోరారు. అమరావతిలోని అసెంబ్లీ ఆవరణలో గురువారం ఎమ్మెల్యేను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకు వెళ్తామన్నారు. అసెంబ్లీలో కూడా దీనిపై సంబంధిత మంత్రి మాట్లాడారన్నారు. అతి త్వరలో జిల్లాలో ఐటీడీఏ ఏర్పాటుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందన్నారు.

చట్ట పరిధిలో వ్యాపారాలు చేసుకోవాలి

అరసవల్లి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): తోపుడు బండ్ల వ్యాపారులు చట్ట పరిధిలో తమ వ్యాపారాలు చేసుకోవాలని అసిస్టెంట్ ఫుడ్ కమిషనర్ కె.వెంకటరత్నం తెలిపారు. ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి ప్రయాణిస్తూ కాలినడకన తోపుడు బండ్లపై ప్యాక్ చేసిన లేదా తయారు చేసిన ఆహారాన్ని విక్రయించే వ్యాపారులు ఎటువంటి రుసుం చెల్లించకుండా ఎఫ్ఎస్ఎస్ఏఐ రిజిస్ట్రేషన్ ధ్రువపత్రం సంబంధిత పోర్టల్‌లో లేకుంటే యూజర్ మాన్యువల్ ద్వారా ఉచితంగా పొందవచ్చునని తెలిపారు. ఈ ఉత్తర్వులు గతేడాది సెప్టెంబరు నుంచి అమల్లోకి వచ్చినట్టు తెలిపారు. మరిన్ని వివరాలకు 1800112100 ఫోన్ నెంబరులో సంప్రదించాలన్నారు. అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, చట్ట పరిధిలో తమ వ్యాపారాలను నిర్వహించుకోవాలన్నారు.

బాలల సంరక్షణ కేంద్రాల రిజిస్ట్రేషన్ గడువు పెంపు

శ్రీకాకుళం కలెక్టరేట్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ, ప్రభుత్వేతర బాలల సంరక్షణ కేంద్రాల నిర్వహణకు రిజిస్ట్రేషన్ గడువును ఈ నెల 10వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా పర్యవేక్షణాధికారి బీవీ రవికుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బాలల న్యాయ (జువైనల్ జస్టిస్) చట్టం, 2015లోని సెక్షన్ 41 ప్రకారం రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని అన్నారు. గడువు పొడిగించాలన్న కొన్ని సంస్థల విజ్ఞప్తి మేరకు ఈ గడువును పొడిగించామని తెలిపారు. ఇప్పటివరకు రిజిస్ట్రేషన్ చేయించుకోని సంస్థలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మార్చి 10వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. గడువు దాటిన తరువాత రిజిస్ట్రేషన్ లేకుండా నడిపే కేంద్రాలపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రణస్థలం గ్యాస్ ఏజెన్సీకే నిర్వహణ బాధ్యత

పొందూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): బిల్లుకంటే అదనపు వసూలు ఆరోపణలపై విచారణ ఎదుర్కొన్న పొందూరు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ నిర్వహణ బాధ్యతలను గురువారం తిరిగి రణస్థలం గ్యాస్ ఏజెన్సీకే అధికారులు అప్పగించారు. ఐదు రోజుల కిందట పొందూరు పట్టణానికి చెందిన పలువురు మహిళలు కలెక్టర్ ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో మూడు రోజులు విచారణ చేపట్టిన డీఎస్‌వో జి.సూర్యప్రకాష్, తహసీల్దార్ ఆర్.వెంకటేష్ ఇచ్చిన నివేదికతో రెండు రోజుల కిందట ఈ గ్యాస్ ఏజెన్సీ నిర్వహణ బాధ్యతలను రణస్థలం ఏజెన్సీకి అప్పగించారు. ఈ క్రమంలో జాయింట్ కలెక్టర్ బుధవారం విచారణ చేపట్టి తిరిగి పాత ఏజెన్సీకే నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. ఈ నిర్ణయంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో సమగ్ర విచారణ చేపట్టాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఆదేశించడంతో గురువారం ఉదయం నుంచి డీఎస్‌వో సూర్యప్రకాష్, తహసీల్దార్ వెంకటేష్ స్టాక్ వివరాలపై విచారణ చేపట్టి తేడాలు ఉన్నట్టు గుర్తించారు. దీనిపై జేసీ ఆదేశాల మేరకు గ్యాస్ డెలివరీ, ఏజెన్సీ నిర్వహణ బాధ్యతలు తిరిగి రణస్థలం ఏజెన్సీకి అప్పగిస్తూ ఆదేశించారు. గ్యాస్ డెలివరీ విషయంలో వినియోగదారులు ఇబ్బంది పడకుండా చూడాలని నిర్వాహకులను అధికారులు ఆదేశించారు.

నేడు ఎల్లమ్మ జాతర

ఇచ్ఛాపురం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): జామి ఎల్లమ్మ జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. కాగా ఎల్లమ్మ జాతర సందర్భంగా పట్టణంలో ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేస్తున్నామని సీఐ మీసాల చిన్నమనాయుడు తెలిపారు. బెల్లుపడ రోడ్‌లో ఎల్లమ్మ జాతర జరుగనుందని, అందువల్ల స్కైడ్రాప్ జంక్షన్ నుంచి ఇచ్ఛాపురం పట్టణంలోకి రావాల్సిన వాహనాలు సుమండి, ఏఎస్‌పేట మీదుగా మళ్లిస్తున్నట్టు తెలిపారు. అదే విధంగా ఇచ్ఛాపురం పట్టణం నుంచి స్కైడ్రాప్ జంక్షన్ వైపు వెళ్లాల్సిన వాహనాలు ఏఎస్ పేట, సుమండి మీదుగా వెళ్లాలన్నారు. జాతరకు వచ్చే భక్తులు తమ వాహనాలను సురంగి రాజా మైదానంలో పార్కింగ్ చేయాలని తెలిపారు.

● కంచిలి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కంచిలిలో జామి ఎల్లమ్మ జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గురువారం ఆలయాన్ని అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు.

యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యం

● సీడాప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.శ్యామ్‌ప్రసాద్


శ్యామ్‌ప్రసాద్

నెల్లిమర్ల, మార్చి 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణాభివృద్ధిశాఖా మంత్రి లోకేశ్ ఆదేశాల మేరకు సెంచూరియన్ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు (సొసైటీ ఫర్ ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్) సీడాప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె. శ్యామ్‌ప్రసాద్ చెప్పారు. గురువారం ఇక్కడ జిల్లా స్థాయి జేడీఎంలకు శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీడాప్ చైర్మన్ జి.దీపక్‌రెడ్డి, సీఈవో పి.నారాయణ స్వామి వర్చువల్ విధానంలో మాట్లాడుతూ రాష్ట్రంలో రానున్న రెండేళ్లలో 30వేల మంది యువతకు ఉపాధి, వ్యవస్థాపకులుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో సీడాప్ పనిచేస్తోందన్నారు. తొలిరోజు శిక్షణ కార్యక్రమంలో సెంచూరియన్ విశ్వవిద్యాలయం విస్తరణ, స్కిల్స్, ఇంక్యుబేషన్ సెంటర్ డీన్ ప్రొఫెసర్ జె.అనీల్‌కుమార్ బిజినెస్ మోడళ్లు, మార్కెటింగ్ లింకేజీలు, బై బ్యాక్ విధానం తదితర అంశాలపై వివరించారు. అలాగే వ్యవసాయ రంగంలో డ్రోన్ల వినియోగం, ఆదాయ మార్గాల కోసం వివరించారు. స్టేట్ మిషన్ మేనేజర్లు టి.అశోక్‌కుమార్, రామకృష్ణ, ప్రసాద్, విజయ్‌కుమార్, వివిధ జిల్లాలకు చెందిన జాబ్స్ డిస్ట్రిక్ట్ మేనేజర్లు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతకు దోహదం

ఎచ్చెర్ల, మార్చి 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించేందుకు ఉత్సవ్ వంటి కార్యక్రమంలో పాల్గొనాలని రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎం.విజయ్‌కుమార్ అన్నారు. స్థానిక ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో గురువారం టెక్నీవర్స్ పేరిట మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఉత్సవ్ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించినప్పుడే విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యత వెలికితీసేందుకు దోహదపడుతుందన్నారు. దేశంలోని వివిధ ఐఐటీల నుంచి నిష్ణాతులైన అచార్యులు ఈ ఉత్సవ్‌లో పాల్గొంటున్నారన్నారు. డైరెక్టర్ కేవీజీడీ బాలాజీ, ఏవో ఎం.రామకృష్ణ, అకడమిక్ డీన్ కె.మోహన్‌కృష్ణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

వీఆర్వోలపై పని ఒత్తిడి తగ్గించాలి

శ్రీకాకుళం కలెక్టరేట్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖకు చెందిన వీఆర్వోలపై ఇతర శాఖలకు చెందిన విధులు కేటాయించడం వల్ల పని ఒత్తిడి పెరిగిందని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.అప్పలనాయుడు అన్నారు. పనిఒత్తిడిని తగ్గించాలని, వీఆర్వోలను రెవెన్యూ సేవలకు సంబంధించిన విధులకు మాత్రమే వినియోగించాలని కోరుతూ గురువారం సాయంత్రం వారు కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. డీఆర్వో వినతిపత్రం సమర్పించారు.

నీటి చౌర్యానికి పాల్పడితే జరిమానా

ఆమదాలవలస, మార్చి 6(ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘంలోని తాగునీటి కొళాయిలకు అ క్రమంగా మోటార్లను బిగించి నీటి చౌర్యానికి పాల్పడితే రూ.3వేలు జరిమానా విధిస్తామని మున్సిపల్ కమిషనర్ పూజారి బాలాజీ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పురపాలక సంఘంలో వేసవి దృష్ట్యా ప్రజలకు తాగునీరు సరఫరా చేయడంలో అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకుంటేంటే.. మోటార్లను బిగించడం మంచిది కాదన్నారు.



మార్చురీలో విరిగిపోయిన మార్బుల్ పలకలు

పర్యవేక్షణ లేక.. పలకలు పగిలి

- వైద్య సిబ్బంది, మృతుల బంధువులకు తప్పని అవస్థలు
- ఇదీ శ్రీకాకుళంలోని సర్వజన ఆస్పత్రి మార్చురీలో పరిస్థితి

శ్రీకాకుళంక్రైం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని రాజీవ్‌గాంధీ ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో గల మార్చురీ నిర్వహణ నీరుగారుతోంది. లోపలి భాగంలో మార్బుల్స్ పలకలు పూర్తిగా పాడయ్యాయి. కొద్దేళ్లుగా పలకలు విరిగిపోయినా సిబ్బంది చోద్యంచూస్తున్నారు. ప్రధానంగా వైద్య శాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో మార్చురీ లోపలి భాగం అధ్వానంగా మారింది. బంధువులు మృతదేహాన్ని చూసేందుకు వెళ్లే సమయంలో విరిగిపోయిన పలకల వద్ద జారిపోతున్నారు. మృతదేహాలను భద్రపరిచే ఫ్రీజర్ బాక్స్‌ల వద్ద, పోస్టుమార్టం నిర్వహించే ప్రాంతాల్లో మార్బుల్ పలకలు పగిలిపోయాయి. దీంతో పోస్టుమార్టం నిర్వహిం చే, మృతదేహాలను ఫ్రిడ్జ్ నుంచితీసే సమయంలో వైద్య సిబ్బందికి గాయలవుతున్నాయి. రిమ్స్ అధికారులు దృష్టి సారించకపోవడంతో వైద్య సిబ్బందికి, మృతదేహాలను తరలించే పోలీసులు, మృతుల కుటుంబ సభ్యులకు మార్చురీ గదిలో అగచాట్లు తప్పడంలేదు.

కాలువలు పాడై.. మురుగు పేరుకుపోయి

- దుర్వాసనతో గ్రామస్థులకు అవస్థలు
- ఇదీ నీలాదేవిపురంలో పరిస్థితి

బూర్జ,మార్చి6(ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలాదేవిపురం (నీలంపేట)లో మురుగు కాలువలు శిథిలావస్థకు చేరుకున్నాయి. పలు చోట్ల కాలువలు మూతపడి పోవడంతో మురుగు నీరు బయటకు వెళ్లని పరిస్థితి నెలకొంది. దీంతో రోడ్లపైకి చేరడంతోపాటు రోజులతరబడి నిల్వఉంటోంది.దీంతో దుర్వాసన వెలువడడంతోపాటు దోమలు స్వైరవిహారం చేస్తుండడంతో వ్యాధులుప్రబలుతాయెమోనని గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. నీలంపేట మేజర్ పంచాయతీగా అప్‌గ్రేడ్ అయినా మురుగు కాలువల నిర్వహణపై నిర్లక్ష్యం చూపుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. దశాబ్దాల కిందట నిర్మించిన కాలువలకు కనీసం మరమ్మతులు లేకపోవడంతో గట్లు విరగడంతో పాటు,కాలువ పైకప్పులు పూర్తిగా పెచ్చులు విరిగిపోయాయి. తక్షణమే కూటమి ప్రభుత్వం కాలువలను మరమ్మతులు చేసి మురుగు నిర్వహణపై దృష్టిసారించాలని పలువురు కోరుతున్నారు.



కాలువలో పేరుకుపోయిన మురుగు నీరు



మురుగు నీటిలో ఉన్న కొళాయి వద్ద నీటిని పడుతున్న మహిళలు

మురుగు నీటిలో కొళాయిలు

- నివగాం గ్రామంలో దుర్గంధం మధ్య నీటిని సేకరిస్తున్న మహిళలు

కొత్తూరు, మార్చి6(ఆంధ్రజ్యోతి): మండలంలోని నివగాంలో కొళాయిలు మురుగునీటిలో ఉండడంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. కొళాయిపైపులు బురదలో ఉండడంతోపాటు పరిసరాలు చెత్త, పెంటకుప్పలు పేరుకుపోయాయి. ఆ నీటినే సేకరించి తాగుతుండడంతో వ్యాధులు ప్రబలుతాయోమోనని వాపోతున్నారు. మురుగులో కొళాయిల వద్ద నీటిని సేకరించే సమయంలో దుర్గంధంతో అవస్థలకు గురవుతున్నామని మహిళలు వాపోతున్నారు. మురుగునీటిని తొలగించాలనికోరుతున్నా పట్టించుకోవడంలేదని మహిళలు వాపోతున్నారు.ఎస్సీవీధి నుంచి సెల్‌టవర్ వరకు ఉన్న రహదారి పక్కన మురుగు నీరు నిల్వఉంటోంది. ఆ నీటిలో ఉన్న కొళాయిలు వద్ద తాగు నీటిని పట్టుకోవడానికి పడికాపులు కాయల్సి వస్తోందని మహిళలు చెబుతున్నారు. కలుషిత నీటినితాగడం వల్ల వ్యాధుతోపాటు చర్మ, శ్వాసకోశ సమస్యలు ఉత్పన్నమయ్యే ప్రమాదముందని ఆందోళనచెందుతున్నారు. కాగా కొళాయిలు వద్ద మురుగు నిల్వలు తొలగింపునకు డ్రైవ్ నిర్వహించాలని కార్యదర్శి జీబీ లక్ష్మిని ఆదేశించినట్లు ఈవోపీఆర్డీ వసంతకుమారి తెలిపారు.

బ్రాహ్మణతర్లాలో ఒకరి అదృశ్యం



మల్లేశ్వరరావు (ఫైల్)

పలాస,మార్చి 6(ఆంధ్రజ్యోతి):మండలంలోని బ్రాహ్మణతర్లాకు చెందిన కుప్పిలి మల్లేశ్వరరావు అదృశ్యమయ్యాడు. ఈ మేరకు ఆయన కుమార్తె గీతాంజలి కాశీబుగ్గ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. పోలీసల కథనం మేరకు.. మల్లేశ్వరరావు తన తల్లి మహాలక్ష్మి ఇంటివద్ద ఉంటున్నారు. గత నెల 19న మల్లేశ్వరరావు ఇంటినుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల గ్రామాలతోపాటు బంధువుల ఇళ్లల్లో కూడా వెతికినా ఆచూకీ లభ్యంకాలేదు. ఇంటి నుంచి వెళ్లిన సమయంలో నలుపురంగు ఫ్యాంటు, పచ్చరంగు షర్టు వేసుకున్నాడు. ఆచూకీ తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సీఐ పి.సూర్యనారాయణ కోరారు. ఈ మేరకు కేసు నమోదుచేశారు.

పగటిపూట రెక్కీ.. చీకటిపడితే చోరీ

- నరసన్నపేటలో తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా దొంగతనాలు

నరసన్నపేట, మార్చి 6(ఆంధ్రజ్యోతి):నరసన్నపేటలోని శ్రీనివాసనగర్‌లో బుధవారం రాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. పగటి పూట తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా రెక్కీ నిర్వహించి, చీకటి పడిన తర్వాత చోరీకి పాల్పడ్డారు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. ఆర్‌ఎంపీ వైద్యుడిగా పనిచేస్తున్న పట్నాల నాగేశ్వరరావు, పోలాకి మండలంలోని రేవుఅంపలాం పంచాయతీకార్యదర్శిగా పనిచేస్తున్న టి.దుర్గాప్రసాద్ ఇంటి తాళం పగలు గొట్టి లోపలికి ప్రవేశించారు. నాగేశ్వరరావు ఇంట్లో బీరువా, పరుపులు చిందర వందర చేశారు. బీరువాలోని ఐదు జతలు చెవి దుద్దులు సుమారు రెండు తులాలు బంగారం ఆభరణాలు, రూ.20వేలు నగదు తస్కరించారు. దుర్గాప్రసాద్ కొత్త ఇళ్ల లోపల పని జరుగుతుండడంతో తాళం వేసి ఉండగా, పగులగొట్టి చొరబడ్డారు. ఇళ్ల నిర్మాణంలో ఉండడంతో దొంగతనానికి వీల్లేకుండాపోయింది. నాగేశ్వరరావు భార్యతో కలిసి వారంరోజుల కిందట తీర్థయాత్రలకు వెళ్లారు. దొంగతనానికి పాల్పడిన వారువీధిలో ఉన్నసీసీ కెమెరా వైర్లు కట్ చేశారు. అలాగే నాగేశ్వరరావు ఇంటికి ఉన్న సీసీ కెమెరాలను తొలగించి రికార్డు బాక్సును ఎత్తికెళ్లిపోయారు. స్థానికులు గురువారం చోరీ జరిగిన విషయం గుర్తించి నాగేశ్వరరావుకు సమాచారం ఇచ్చారు. నాగేశ్వరరావు సమాచారంతో పోలీసులు చోరీకి గురైన ఇళ్లను పరిశీలించారు. క్లూస్‌టీము సభ్యులు వివరాలు సేకరించారు. శ్రీనివాసనగర్‌లో అమర్చిన ఇతర సీసీ ఫుటేజ్‌లను పోలీసులు పరిశీలిస్తున్నారు.

ద్విచక్రవాహనాలు ఢీకొని ముగ్గురికి గాయాలు

మెళియాపుట్టి, మార్చి6(ఆంధ్రజ్యోతి):మండలంలోని కొసమాళ సమీపంలో గురువారంరాత్రి రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో ముగ్గురు గాయపడినట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. బీహర్‌కు చెందిన సోనూ, బోలు మెళియాపుట్టి నుంచి పర్లాకిమిడి వైపు,కొసమాళ వైపు నుంచి మెళియాపుట్టి రట్టిణి గ్రామానికి చెందిన బుల్లిబాబు ద్విచక్రవాహనంపై వస్తున్నారు. ఈ రెండు ద్విచక్రవాహనాలు కొసమాళ సమీపంలో ఢీకొనడంతో బోలుతోపాటు బుల్లిబాబుకు బలమైన గాయాలు కావడంతో 108లో పర్లాకిమిడి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదుచేశారు.

కొట్లాటలో ఇరువర్గాలపై కేసు నమోదు

జలుమూరు, మార్చి 6: (ఆంధ్రజ్యోతి) కరకవలస స్థల వివాదంలో ఇరువర్గాల మధ్య జరిగిన కొట్లాటలో ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అశోక్‌బాబు తెలిపారు. తమ స్థలంలో ముళ్లకంపలు వేస్తే తీయాలని కోరగా అదేగ్రామానికి చెందిన మహేశ్వరం కృష్ణమూర్తి, రాఘవరావు, ఈశ్వరరావు, కళ్యాణం తనపై దాడిచేసి గాయపరిచారని గురుబెల్లి వెంకమ్మ ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసినట్లు చెప్పారు. అలాగే తమ స్థలానికి సంబంధించి గురుబెల్లి అప్పన్న, వెంకమ్మ, బొంగు కృష్ణ తన కుమారుడు రాఘవపై దాడిచేసి గాయపరిచారని మహేశ్వరం కృష్ణమూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

న్యాయం చేయకపోతే ఆమరణ దీక్ష చేస్తా

పలాస, మార్చి 6(ఆంధ్రజ్యోతి):సర్వేనెంబరు 42లో 96 సెంట్ల భూమి తన తండ్రి దివంగత బళ్ల నర్సింహమూర్తి వారసత్వ హక్కుగా తమ అన్నదమ్ములకు దఖలుపడగా ఆ భూమిని 22 ఏలో చేర్పించి రెవెన్యూ అధికారులు తన కుటుంబంతోనే ఆటాడుకుంటున్నారని పలాస-కాశీబుగ్గ మునిసిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు ఆరోపించారు. తనకున్యాయం చేయకపోతే రెవెన్యూ కార్యాలయంఎదుటే ఆమరణనిరాహారదీక్ష చేస్తానని ప్రకటించారు.గురువారం పలాసలో విలేకరులతో మాట్లాడుతూ జిరాయతీని ప్రభుత్వ భూమిగా చూపించారని తెలిపారు. పురుషోత్తపురం సర్వేనెంబరు 25/3లో 64 సెంట్లు భూమి వారసత్వంగా తమ సోదరులకు రాగా అడంగళ్ పత్రాల్లో అసలు భూమే లేదని చెబుతున్నారని, ముటేషన్‌కు దరఖాస్తు చేసుకోగా ఆ సర్వేనెంబరులో భూమి కృష్ణచంద్రదేవ్ స్వాధీనంలో ఉన్నట్లు నివేదిక ఇచ్చారని వాపోయారు. కాగా రెవెన్యూ సదస్సులో కంప్యూటరీకరణలో తప్పులు జరిగాయని, దీన్ని గుర్తించి తగు ఆదేశాలు ఇప్పటికే ఇచ్చామని తహసీల్దార్ టి.కళ్యాణచక్రవర్తి తెలిపారు. మిగిలిన భూముల వ్యవహారంలో సిబ్బందికి ఆదేశాలిస్తామని చెప్పారు.

నాణ్యత లోపిస్తే బిల్లులు నిలిపివేస్తాం: డీఈ

ఎల్.ఎన్.పేట, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఉపాధి పథకం నిధులతో జరుగుతున్న రోడ్లుపనుల్లో నాణ్యత ప్రమాణాలులేనట్లు నిర్ధారణ జరిగితే బిల్లులను నిలిపివేస్తామని క్వాలిటీ కంట్రోల్ డీఈ నగేష్‌బాబు తెలిపారు. గురువారం మండలంలోని శ్యామలాపురంతోపాటు మరికొన్ని గ్రామాల్లో సీసీరోడ్డు పనులను పరిశీలించారు. ఆయన వెంట క్వాలిటీ కంట్రోల్ ఏఈ అమృతలక్ష్మణ్, పీఆర్ ఏఈ హిమసాగర్ ఉన్నారు.

గజాల లెక్కన పరిహారం చెల్లించండి

- జాతీయరహదారి విస్తరణలో స్థలాలు కోల్పోయిన బాధితుల డిమాండ్



జలుమూరులో మాట్లాడుతున్న భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లావణ్య

జలుమూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) తమకు నష్టపరిహారం ఎకరాల్లో కాకుండా గజాలు లెక్కల్లో చెల్లించాలని చల్లవానిపేట కూడలిలో జాతీయరహదారి విస్తరణలో ఇళ్ల స్థలాలు కోల్పోయిన బాధితులు డిమాండ్‌చేశారు. ఈమేరకు గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో వంశధార భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టరు ఎం.లావణ్య బాధితులో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రికార్డుల ప్రకారం స్థలాలు ఎకరాల్లో ఉన్నాయని అవి గజాల్లో మార్చాలంటే వ్యవసాయేతర భూముల కింద రికార్డుల్లో నమోదు కావాలని తెలిపారు. వ్యవసాయేతర భూములు కింద ఉన్నట్లుఆధారాలు ఉంటే సోమవారం కార్యాలయానికి వచ్చి అందజేయాలని కోరారు. సమావేశంలో తహసీల్దారు జన్ని రామారావు, భూసేకరణ టీడీ సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

చేయి చేయి కలిపి.. రోడ్డు అభివృద్ధి చేసి

- నివగాంలో గోతులు పూడ్చిన యువకులు

కొత్తూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి):నివగాం వద్ద పాలకొండ-హడ్డుబంగి రహదారి ఉన్న గోతులను గ్రామ యువకులు ముందుకొచ్చి పూడ్చారు. గోతులు పూడ్చాలని పలుసార్లు స్థానికులు ఆర్‌అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో యువత ముందుకు వచ్చి చేయి చేయి కలిపి విరాళాలు రూపంలో నిధులు సేకరించి గురువారం గోతులను యంత్రాలతో పూడ్చారు.

టెక్కలిలో శ్రమదానం

టెక్కలి, మార్చి 6(ఆంధ్రజ్యోతి):స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో వాకర్స్‌మైదానాన్ని శ్రమదానంతో గురువారం శుభ్రపరిచారు.ఇటీవల ఓ కార్యక్రమం నిర్వహించిన తర్వాత చెత్త పేరుకుపోయింది. ఈమేరకు శుభ్రపరిచేందుకు నిర్వాహకులు ముందుకు రాకపోవడంతో వాకర్స్ యువకులు, ఉపాధ్యాయులు శ్రమదానం చేపట్టి పరిసరాలను శుభ్రపరిచారు. కార్యక్రమంలో దోని కొండలరావు, మూర్తి శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరావు, బాపూజీ, లక్ష్మణరావు పాల్గొన్నారు.

తడి, పొడి వ్యర్థాల నిర్వహణపై శిక్షణ



నందిగాం: అవగాహన కల్పిస్తున్న రిసోర్స్‌పర్సన్ ఆనందరావు

నందిగాం,మార్చి 6(ఆంధ్రజ్యోతి):నందిగాంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో టెక్కలి, మెళియాపుట్టి మండలాలకు చెందిన కార్యదర్శులకు జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం ఆధ్వర్యంలో తడి,పొడి వ్యర్థాలు నిర్వహణపై గురువారం శిక్షణ నిర్వహించారు. రిసోర్స్‌పర్సన్ పి.ఆనందరావు నేతృత్వంలో తడిచెత్త నుంచి వర్మీకంపోస్ట్ తయారీ, పంచాయతీల ఆర్థికాభివృద్ధిలో పొడిచెత్త అమ్మకాలతో కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీలు డి.రామకృష్ణ, కె.సింహాద్రి, టెక్కలి ఈవో జగన్నాథరావు, కార్యదర్శులు కె.గోపీనాథ్, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

- హిరమండలం, మార్చి6 (ఆంధ్రజ్యోతి): హిరమండలంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద గురువారం ఘన వ్యర్థాల నిర్వహణపై డీపీఆర్సీ రిసోర్స్ పర్సన్స్ కొత్తూరు, హిరమండలం, ఎల్.ఎన్.పేట, సరుబుజ్జిలి, పాతపట్నం మండలాలకు చెందిన పంచాయతీ విస్తరణాధికారులు, కార్యదర్శులు,గ్రీన్ అంబాసిడర్లకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా టెక్కలి డివిజనల్ పంచాయతీ అధికారి ఆర్.గోపాలకృష్ణ మాట్లాడుతూ చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని కోరారు.

రాజులు చెరువు అభివృద్ధికి చర్యలు

నరసన్నపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజులు చెరువును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.ఈ మేరకు గురువారం నరసన్నపేటలో ఆర్డీవో సాయిప్రత్యూష వివిధ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించి చెరువు గట్టు చుట్టు వాకింగ్ ట్రాక్ ఏర్పాటు, ఇళ్ల నుంచి చెరువులోకి వ్యర్థాలు వెళ్లకుండా నిరోధించడం, మంచినీరు కోనేరుగా మార్చి బోటు షికారు ఏర్పాటు చేయడంపై చర్చించారు. అనంతరం రాజులు చెరువు పరిశీరాలను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణ, ఇరిగేషన్ ఏఈ శిమ్మ శ్రీనివాసరావు, టూరిజం శాఖ ప్రతినిధి పోగోటి అశోక్, ఉద్యానవనశాఖ అధికారి బగ్గు అమల, ఏపీవో యుగంధర్, పంచాయతీ, సర్వేశాఖ అధికారులు పాల్గొన్నారు.

విచ్చలవిడిగా గంజాయి రవాణా

నరసన్నపేట, మార్చి 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలో విచ్చలవిడిగా గంజాయి రవాణా వ్యాపారం సాగుతోందని పోలాకి జడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తంచేశారు. గంజాయి మత్తులో ఓ ఆగంతకుడు వృద్ధురాలిని హత్యకు పాల్పడిన సంఘటనే పట్టణంలో ఏ రకంగా గంజాయి బ్యాచ్ అరాచకాలు జరుగుతున్నాయే స్పష్టం అవుతోందని తెలిపారు.

డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయాలి

నరసన్నపేట, మార్చి 6(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మొజ్జాడ యుగంధర్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు సంతోష్, కె.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. గురువారం నరసన్నపేటలో విలేకరులతో మాట్లాడుతూ పట్టణాలు మెడికల్ మాఫియాగా మారాయని, ఆర్‌ఎంపీ నుంచి ఎండీ వరకు అధిక మొత్తంలో టెస్టులు, స్కానింగ్‌పేరుతో దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. జిల్లా మత్తుపదార్థాలకు అడ్డగా మారిందన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఆర్.అరవింద్, పి. వాసు, వై. వేణు, నారాయణరావు, భాస్కరరావు పాల్గొన్నారు.

నందిగాంలో మహిళా దినోత్సవం

నందిగాం,మార్చి 6(అంధ్రజ్యోతి):నందిగాంలో ఐసీడీఎస్‌ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. నందిగాం-1 సెక్టార్ స్థాయిలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జలజాక్షి నేతృత్వంలో ర్యాలీ చేపట్టి మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు.

కూటమితోనే గిరిజనాభివృద్ధి

మెళియాపుట్టి, మార్చి6(ఆంధ్రజ్యోతి):కూటమి ప్రభుత్వంతోనే గిరిజనాభివృద్ధి సాధ్యమని టీడీపీ గిరిజన విభాగ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బైరిసింగి దినకర్‌రావు తెలిపారు. గురువారం మెళియాపుట్టిలో విలేకరులతో మాట్లాడుతూ వైసీపీకి గిరిజనులు నమ్మితే మోసం తప్ప లాభంలేదని తెలిపారు. ఐటీడీఏ లేకుండా చేసి మోసం చేశారని చెప్పారు.

చెరువులో ఆక్రమణలు అడ్డుకోవాలి

పాతపట్నం మార్చి6(ఆంధ్రజ్యోతి):ప్రహరాజపాలెం రెవెన్యూ గ్రామపరిధిలోగల కొత్త చెరువులో ఆక్రమణలను అధికారులు అడ్డుకోవాలని టీడీపీ నాయకులు కోరారు. గురువారం ప్రహరాజపాలెం రెవెన్యూ గ్రామ పరిధిలోగల కొత్తచెరువు ఆక్రమణకు గురవుతుందన్న సమాచారం మేరకు టీడీపీనాయకుడు శివాలచిన్నయ్య ఆధ్వర్యంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు సైలాడ సతీష్,అక్రంద్ర సన్యాసిరావు, హరి పరిశీలించారు. అనంతరం తహసీల్దార్‌కు సమాచారంతెలియజేశారు.ఈసందర్భంగా చిన్నయ్యమాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే రెడ్డిశాంతి అనుచరుల్లో కొంతమంది వైసీపీనేతలు కొత్తచెరువు ఆక్రమణలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కాగా వీఆర్వో పి.శ్రావణి వీఆర్ఏ వెంకటరమణ ఘటనా స్థలానికి వెళ్లి చెరువు గర్భాన్ని పరిశీలించి తహసీల్దార్ దృష్టికి తీసుకువెళ్లారు. సర్వే నిర్వహించి హద్దులను గుర్తించాలని క్షేత్రస్థాయి అధికారులను తహసీల్దార్ ఎస్.కిరణ్‌కుమార్ ఆదేశించారు.సర్వేయర్ షణ్ముఖరావు సర్వేచేపట్టి ఆక్రమణలను గుర్తించారు. గుర్తించిన ఆక్రమణల చుట్టూ యంత్రాలతో తవ్వకాలు జరిపించి ట్రెంచ్‌లతోపాటు ఆక్రమణలకు పాల్పడితే చర్యలుతీసు కుంటామని హెచ్చరిక బోర్డులను ఏర్పాటుచేశారు.

గిరిజనులకు మద్యం దుకాణాలు కేటాయించాలి

జలుమూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి):గిరిజనులకు మద్యం దుకాణాలు కేటాయించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి కోరారు. గురువారం జలుమూరులో విలేకరులతో మాట్లాడుతూ గీత కార్మికులు, సొండి కులస్థులకు మద్యం షాపులు కేటాయించినట్లు గిరిజనులకు కూడా కేటాయించాలని డిమాండు చేశారు. సమావేశంలో ఆదివాసిసంక్షేమ పరిషత్ సభ్యులు జన్ని దాలయ్య, బాలకృష్ణ, నాగేశ్వరరావు, కృష్ణారావు పాల్గొన్నారు.

పని ప్రదేశాల్లో పందిర్లు ఏర్పాటుచేయాలి

మెళియాపుట్టి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): వేసవి దృష్ట్యా వేతనదారులు ఉదయం వేగం పనుల్లోకి వెళ్లి జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో ప్రసాద్‌పండా ఒక ప్రకటనలో తెలిపారు. పనిచేసే ప్రదేశాల్లో పందిర్లుఏర్పాటుచేసుకోవాలని కోరారు. ప్రథమ చికిత్స కిట్లతోపాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని పేర్కొన్నారు.

నేడు జామి జాతర

హరిపురం, మార్చి6 (ఆంధ్రజ్యోతి): మందస మండలంలోని మూలిపాడు పంచాయతీ శ్రీనివాసపురంలో శుక్రవారం జామి ఎల్లమ్మ యాత్ర నిర్వహించనున్నట్లు పూజాకమిటీ సభ్యులు తెలిపారు. ఎల్లమ్మను దర్శించుకొనేందుకు మందసతోపాటు సోంపేట, పలాస, ఒడిశాలోని పలుప్రాంతాల నుంచి భక్తులు రానుండడంతో నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

నేడు జంజీరుతోటలో...

సంతబొమ్మాళి, మార్చి6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేఘవరం దరి జంజీరు తోటలో ఎల్లమ్మజాతర శుక్రవారం జరగనుంది. తీరప్రాంత గ్రామాల నుంచి భక్తులు జాతరకు తరలిరానుండడంతో నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

నేడు గోకార్టింగ్ పోటీలు

టెక్కలి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): కె.కొత్తూరు దరి ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయస్థాయి గోకార్టింగ్ సీజన్-2 పోటీలకు ప్రాథమిక పరీక్షలను సంబంధిత నిపుణులు గురువారం నిర్వహించి శుక్రవారం జరిగే పోటీలకు సిద్ధం చేశారని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వీవీ నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు తమిళనాడు, తెలంగాణ, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ నుంచి 16 గోకార్టింగ్ బృందాలు హాజరయ్యాయని, వీటిలో మానువరబిలిటీ, బ్రేక్ పరీక్షలను చేపట్టారని పేర్కొన్నారు.

కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ

టెక్కలి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): పదోతరగతి, ఆపై చదువుకున్న వారికి కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ డొమెస్టిక్ నాన్‌వాయిస్, ఎంఎస్ ఆఫీస్ కోర్సుకు సంబంధించి మూడు నెలల పాటురాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ టి.గోవిందమ్మ తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 11లోగా తమ సర్టిఫికెట్లతో పాటు ఆధార్‌కార్డు జిరాక్స్, రెండు పాస్‌పోర్టుసైజు ఫోటోలతో స్కిల్ హబ్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

91 మందికి కంటి పరీక్షలు

నరసన్నపేట, మార్చి 6(ఆంధ్రజ్యోతి): స్థానిక బొడ్డవలస సత్యసాయి మందిరంలో గురువారం 91 మందికి పరీక్షలు నిర్వహించగా 22 మంది కాటరాక్టుతో బాధపడుతున్నట్లు గుర్తించి శస్త్రచికిత్సకు ఎంపికచేశారు. కార్యక్రమంలో కంటి ఆసుపత్రి వైద్యనిపుణులు కృష్ణనాథ్, సభ్యులు పాల్గొన్నారు.

50 మంది రక్తదానం

టెక్కలి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్ర ఆసుపత్రి సమన్వయంతో గురువారం నిర్వహించిన శిబిరంలో 50మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ, వైస్‌ప్రిన్సిపాల్ బి.సతీష్‌కుమార్, ఐపీఎస్సీ కో-ఆర్డినేటర్ వి.లూక్పాల్, వైద్యులు బి.సునీత, ల్యాబ్ టెక్నీషియన్ డి.విజయ, ఎన్ఎస్ఎస్ పీవోలు డి.వాసుబాబు, కందిగొల్ల, రెడ్ రిబ్బన్ క్లబ్ కో-ఆర్డినేటర్ రాంబాబు పాల్గొన్నారు.

యువతకు పూలే స్ఫూర్తి

టెక్కలి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): సావిత్రి బాయి పూలే యువతరానికి గొప్ప స్ఫూర్తి అని దళిత సంఘాల నాయకులు పేర్కొన్నారు. గురువారం టెక్కలిలో సావిత్రిబాయిపూలే 128వ వర్థంతి పురస్కరించుకుని కేఎన్‌పీఎస్, ఎస్ఎన్‌పీఎస్, డీహెచ్‌పీహెచ్ఎస్ అధ్యక్షులు బెలమర ప్రభాకరరావు, జి.గణేష్, బి.ధనరాజు, టి.రమణ, ఆర్.రాంబాబు, చల్లరాజు కరపత్రాలను ఆవిష్కరించారు.

జగన్‌ను ప్రజలు నమ్మరు

టెక్కలి,మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యేగా గెలుపొందిన వైసీపీ అధ్యక్షుడు జగన్ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా బాధ్యత మరిచి ప్రతిపక్ష హోదా ఇవ్వాలనే కుంటి సాకులతో అసెంబ్లీకి వెళ్లకుండా మాయమాటలతో కాలం గడుపుతున్నారని, దీన్ని ప్రజలు నమ్మరని జనసేన జిల్లా ప్రధానకార్యదర్శి కూరాకుల యాదవ్ ఒక ప్రకటనలో గురువారం పేర్కొన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌పై జగన్ విమర్శలు చేయడం ఆయన మానసిక పరిస్థితిపై అనుమానం కలుగుతోందని తెలిపారు.



కోటబొమ్మాళి: ఎల్లమ్మతల్లికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



పలాస రూరల్: టెక్కలిపట్నంలో జాతర ప్రాంగణంలో భక్తుల సందడి

భక్తిశ్రద్ధలతో ఎల్లమ్మతల్లికి పూజలు

జిల్లాలో పలు చోట్ల ఎల్లమ్మతల్లి జాతర పురస్కరించుకుని గురువారం ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. భక్తులు మొక్కలు చెల్లించుకున్నారు.

- కోటబొమ్మాళి, మార్చి 6(ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిన్న సానలో గురువారం ఎల్లమ్మతల్లి గ్రామదేవత ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ ధర్మకర్త బోనేల ఎల్లయ్య రాములమ్మలుఆధ్వర్యంలో ఎల్లమ్మతల్లిని ఊరేగించారు. అనంతరం గ్రామస్థులతోపాటు చుట్టుపక్కల భక్తుల మధ్య మూరాటలతో మొక్కులు చెల్లించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం మహిళలు ఎల్లమ్మతల్లికి కుంకుమపూజలు చేశారు.రోణంకి మల్లయ్య, అన్నెపు రామారావు, ఎస్.రాజు, కాళ్ళ సంజీవరావు తదితరులు ఎల్లమ్మతల్లికి దర్శించుకొన్నారు.
- పలాసరూరల్, మార్చి6(ఆంధ్రజ్యోతి): మండలంలోని టెక్కలిపట్నం జామి ఎల్లమ్మ ఆలయం ఆవరణలో జామిజాతర నిర్వహించారు. ఉదయం భక్తులు ఎలమ్మ తల్లిని దర్శించుకునేందుకు బారులు తీరారు. సాయంత్రం అమ్మవారికి ఊరేగించారు. అమ్మవారికి వేపాకు,పసుపు, కుంకుమ,బియ్యం అందజేసి భక్తులు వారి కోర్కెలు తీరాలని పూజలు చేపట్టారు.